Licensed to post without Prepayment No. J/Nellore/003/15-17 R.N.I.No.25359/74 - PLG/NL/9-10/03
నెల్లూరు, 01.09.2017, శుక్రవారం సంపుటి : 37 సంచిక : 13 పేజీలు : 12, వెల : ₹ 5




# లాయర్

వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంగ్రాహకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి www.lawyerteluguweekly.com







# నంద్యాల దేనికి... గెలుపు మలుపు?

పదిహేడు వేల ఇళ్ళు...
ఆటోనగర్‌లో వేలాది మందికి స్థలాల రిజిస్ట్రేషన్లు...
10వేల సంఖ్యలో మహిళలకు కుట్టుమిషన్లు...
50వేల ముక్కుపుడకలు...
600 ట్రాక్టర్లు...
డ్వాక్రా మహిళలకు ప్రత్యేక ఋణాలు...
ఒక్క నంద్యాల నియోజకవర్గంలోనే 1400 కోట్ల అభివృద్ధి పనులు...
నంద్యాలలో ఓట్లేసిన వాళ్లకు తెలుగుదేశం పార్టీ ప్రకటించిన వరాలు.
ఇక ఓటు వేయకుంటే...
రేషన్ కట్...
పింఛన్ కట్...
ఆరోగ్యశ్రీ కార్డు కట్...
మీ ఇంటికి కుళాయి కట్...
మీ వీధిలో రోడ్డు కట్...
మీ ఊరిలో అభివృద్ధికే ఫుల్‌స్టాప్...
అంతేనా...
ప్రభుత్వమే అమరావతిని వదిలి నంద్యాలలో సెటిలయ్యింది.
10మంది మంత్రులు, 30మంది ఎమ్మెల్యేలు వార్డు ఇన్‌ఛార్జిలయ్యారు.
ఇక పోలీసుల సహకారం పూర్తిస్థాయిలో సద్వినియోగం...
ఓటుకు 2వేల నుండి 5వేల రూపాయల వరకు పంపిణీ...
ముస్లిం ఓట్ల కోసం 90లక్షలతో ఇఫ్తార్ విందు...
మైనార్టీ నాయకుడు ఫరూక్‌కు అకస్మాత్తుగా ఎమ్మెల్సీ పదవి ప్రకటించడం... (మిగతా 2వ పేజీలో)

- ప్రలోభాల పర్వంలో 'దేశం'దే పైచేయి
- గెలిచి... పట్టు నిలబెట్టుకున్న బాబు
- ఓడిపోయినా వైకాపాకు మునిగిందేమీ లేదు
- జగన్‌కు హ్యాండిచ్చిన మైనార్టీలు





## మాటతీరు మారాలి!

అనుభవం నుండి పాఠాలు నేర్చుకోని ప్రతిపక్ష నేత

11లో






## కోటంరెడ్డిపై కుట్ర?

### సొంత పార్టీ నేతలే గోతులు తవ్వుతున్నారు

జిల్లాలో నెలరోజులుగా చర్చావేదికగా మారిన బెట్టింగ్ కేసు ఎన్నో మలుపులు తిరుగుతోంది. పోలీసు శాఖ పరంగా చూస్తే వారి లక్ష్యం బుకీల మీద చర్యలు తీసుకోవడమా? లేక ప్రతిపక్ష ఎమ్మెల్యేలను ఈ కేసులో బుక్ చేయడమా అన్నది ఎవరికీ అర్థం కావడం లేదు. ఒకటికి మూడుసార్లు ఎస్పీయే స్వయంగా ఈ కేసులో ఎమ్మెల్యేల పాత్రేమీ లేదని చెప్పిన తర్వాత కూడా ఇద్దరు వైసిపి ఎమ్మెల్యేలు పి.అనిల్‌కుమార్‌యాదవ్, కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డిలకు నోటీసులు జారీ చేయడం, రెండుసార్లు విచారించడం వంటివి జరగడంతో ఈ కేసులో రాజకీయ ఒత్తిళ్లు పనిచేస్తున్నాయా? అన్న అనుమానాలు తలెత్తకపోలేదు. అయితే కేసు మొత్తంగా చూస్తే ఎమ్మెల్యేలు తప్పు చేసుంటే తప్పించుకోలేరు. తప్పు చేయకపోతే బలవంతంగా ఇరికించాలని చూసినా పోలీసు శాఖే అప్రదిష్టపాలవుతుంది. ఏదేమైనా చట్టపరంగా అది పోలీస్‌శాఖ చూసుకుంటుంది. (మిగతా 2వ పేజీలో)

# నంద్యాల గెలుపు... దేనికి మలుపు?

(మొదటి పేజీ తరువాయి)

ఇన్ని ప్రలోభాలను అధిగమించి, బెదిరింపులకు భయపడక 70వేల మంది వైసిపి అభ్యర్థి శిల్పా మోహన్‌రెడ్డికి ఓట్లేసారంటే... అదీ అభిమానం... అదీ నిబద్ధత... ఈ ఓట్లు చెక్కుచెదరవు... రేపు ఎలక్షన్ పెట్టినా, ఇంకో నెల తర్వాత ఎలక్షన్ పెట్టినా శిల్పామోహన్‌రెడ్డికి ఇన్ని ఓట్లు వస్తాయి. మరి తెలుగుదేశం అభ్యర్థికి రేపు ఎలక్షన్ పెడితే 97వేల ఓట్లు వస్తాయనే గ్యారంటీ ఉందా?

దేశ రాజకీయ చరిత్రలో ఒక అధికార పార్టీ ఇంతవరకు ఎప్పుడూ చేయనంతటి అధికార దుర్వినియోగానికి పాల్పడితేనే నంద్యాల ఉపఎన్నికల్లో తెలుగుదేశం పార్టీకి దక్కిన విజయమిది. 27,466ఓట్ల భారీ మెజార్టీతోనే తెలుగుదేశం అభ్యర్థి భూమా బ్రహ్మానందరెడ్డి విజయం సాధించాడు. అధికార పార్టీ ప్రలోభాల ముందు, వారి దూకుడు ముందు, వారి నోట్ల ప్రవాహం ముందు వై.యస్.జగన్మోహన్‌రెడ్డి ప్రజాకర్షణ, వైకాపా అభ్యర్థి శిల్పా మోహన్‌రెడ్డి మంచితనం మట్టి కొట్టుకుపోయాయి.

అయితే ఏది ఏమైనా గెలుపును గెలుపనుకోవాలి. ఓటమిని హుందాగా స్వీకరించాలి. ఇంకో ఒకటిన్నర సంవత్సరంలో సాధారణ ఎన్నికలు రానున్నాయి. భూమా నాగిరెడ్డి మరణంతో ఈలోపే నంద్యాల అసెంబ్లీకి ఉపఎన్నిక రావడంతో దీనిని ఇరు పార్టీలు ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్నాయి. భూమా పార్టీ మారకపోయి వుంటే అసలు ఉపఎన్నిక అవసరముండేదే కాదు. తమ పార్టీ గెలిచిన సీటనిచెప్పి జగన్, చనిపోయిన భూమా నాగిరెడ్డి తమ పార్టీలోని ఎమ్మెల్యే అని చెప్పి చంద్రబాబు... ఎవరికి వాళ్లు వెనక్కి తగ్గకుండా పోటీకి సిద్ధమయ్యారు. దీంతో నంద్యాల ఎన్నికకు సెమీఫైనల్ మ్యాచ్ లాంటి కలరింగ్ వచ్చింది. నంద్యాలలో గెలిచిన వాళ్లదే 2019 ఎన్నికల్లోనూ అధికారం అనేంతటి ప్రచారం వచ్చింది. దాంతో ఇరు పార్టీలు కూడా గట్టి అభ్యర్థులనే బరిలో నిలిపి హోరాహోరీగా తలపడ్డాయి. నంద్యాలలో ఓడిపోతే ఇక రాజకీయ భవిష్యత్ లేదన్నట్లుగా చంద్రబాబు పూర్తిస్థాయిలో దృష్టిపెట్టి పని చేశాడు. పరుగులు తీయించాడు. నంద్యాల ఎన్నికను ప్రతిపక్ష నేత జగన్ ఎంత సీరియస్‌గా తీసుకున్నాడన్న దానికి ఆయన 13రోజుల పాటు ఏకధాటిగా సాగించిన ప్రచారమే ఉదాహరణ.

### ఊహించని గెలుపు

నంద్యాలలో తెలుగుదేశం అభ్యర్థికి ఇంత భారీ మెజార్టీ వస్తుందని తెలుగుదేశం నాయకులు కూడా వూహించలేకపోయారు. పది వేల నుండి పదిహేను వేల మధ్య మెజార్టీతో గెలుస్తామని టీడీపీ నాయకులు అంచనా వేసుకున్నారు. ఇక వైసిపి నాయకులు కూడా పోలింగ్ శాతం పెరిగాక 5వేల మెజార్టీతో నైనా బయటపడతామని ఆశపడ్డారు. అయితే అంచనాలు తలక్రిందులై టీడీపీకి ఊహించని మెజార్టీ వచ్చింది.

### చంద్రబాబును నిలబెట్టాయి

నంద్యాల ఉపఎన్నికల్లో గెలుపు చంద్రబాబు నాయకత్వాన్ని ఒకరకంగా నిలబెట్టిందనే చెప్పాలి. ఏ మాత్రం ఓడిపోయి వున్నా తెలుగుదేశంలో ఇప్పటికే లుకలుకలు మొదలయ్యేవి. ఆ పార్టీ నుండి జంపింగ్‌లు ప్రారంభమయ్యేవి. ఈ గెలుపుతో చంద్రబాబు అయితేనే ఎలక్షన్ చేయగలడు అన్న ఒక నమ్మకం ఆ పార్టీ కేడర్‌లో ఏర్పడింది.

### వైకాపాకు మునిగేదేమీ లేదు

ఉపఎన్నికలలో ఓటమి పాలయినంత మాత్రాన వైకాపా శ్రేణులు నిరుత్సాహం చెందాల్సిన అవసరం లేదు. ఎందుకంటే అధికారపార్టీ ఇన్ని రకాలుగా ప్రలోభపెట్టినా, ఇన్ని వందల కోట్ల తాయిలాలు ఎరవేసినా 70వేల మంది ఓటర్లు వారి వెంట నిలిచారంటే అదే అసలైన బలం. వీళ్లు ఎక్కడికీ పోయేవాళ్ళు కాదు. అదే ఇప్పుడు తెలుగుదేశానికి ఓటేసిన వాళ్ళు రేపు మళ్ళీ అదే పార్టీకి ఓటేస్తారన్న గ్యారంటీ లేదు. ఎందుకంటే నంద్యాల అసెంబ్లీకి ఒక్కదానికే ఎలక్షన్ జరుగుతున్నప్పుడు... ఆ ప్రభావం వేరు, రేపు 175 అసెంబ్లీ సీట్లకు ఒకేసారి ఎలక్షన్ జరుగుతున్నప్పుడు ఆ ప్రభావం వేరు. అప్పుడు ఇంతమంది మంత్రులు, ఎమ్మెల్యేలు వచ్చి ఎలక్షన్ చేయరుగా? ఇన్ని కోట్లు ఖర్చు పెట్టలేరుగా? కాబట్టి ఈ ఓటమిని అనుభవంగా మార్చుకుని లోపాలను సరిదిద్దుకుంటే రేపటి విజయానికి ఈ పరాజయాన్నే మెట్లుగా మలచుకోవచ్చు.

### ఒకే ప్యాట్రన్ పని చేసిందా?

నంద్యాలలో కులాల వారీగా ఓట్లు పడలేదు. అన్ని కులాల వారు, అన్ని మతాల వారు కలిసి మాట్లాడుకున్నట్లుగా తెలుగుదేశం అభ్యర్థికే మెజార్టీ ఓట్లు వేశారు. కేవలం తెలుగుదేశం ప్రభుత్వ అభివృద్ధి పనులను మెచ్చి, చంద్రబాబు పరిపాలనా విధానాలు నచ్చి జనం తెలుగుదేశంకు ఓట్లేసారనుకుంటే అది అతినమ్మకమే అవుతుంది. నంద్యాల ఓటర్లపై అనేక అంశాలు ప్రభావం చూపాయి. ఒక్క నంద్యాల పరిధిలోనే 1400 కోట్ల పనులను మొదలుపెట్టారు. తెలుగుదేశం ఓడిపోతే ఈ పనులన్నీ ఆగిపోతాయని ఆ పార్టీ నాయకులు మొదటి నుండి ప్రచారం చేయసాగారు. రాకరాక మన ఊరికి మంచి అవకాశం వచ్చింది, ఈ ఒక్కసారికి టీడీపీకి ఓటేస్తే ఏం పోతుందిలే, ఇదేం ప్రభుత్వాలను దించేసే ఎలక్షన్ కాదు కదా... టీడీపీని గెలిపిస్తే కనీసం ఈ అభివృద్ధి పనులన్నా పూర్తవుతాయనే ఆలోచనా ధోరణి కామన్ మెన్‌లో పనిచేసింది. అలాగే ఈవిఎంల ప్రభావం కూడా వుంది. బ్యాలెట్ ఎలక్షన్ అయితే అన్నీ కలబోసి కట్టలు కట్టి లెక్కపెడతారు కాబట్టి బూత్‌ల వారీగా ఎవరికెన్ని ఓట్లు వచ్చాయన్న లెక్క రాదు. అదే ఈవిఎంల ద్వారా అయితే బూత్ వారీగా ఓట్లు తెలుస్తాయి. దీనిని ప్రచారం చేసే ప్రజలను భయపెట్టారు. నంద్యాల పట్టణంలో మైనార్టీలు తెలుగుదేశం వైపే మొగ్గు చూపారు. దీనికి కారణం ఆటోనగర్‌లో ముస్లింలు ఎక్కువ. వారు షెడ్లు నడుపుకుంటున్న స్థలాలను వారిపేరు మీదే రిజిస్ట్రేషన్ చేస్తామని ప్రచారం చేశారు. దీనిని ముస్లింలు బాగా నమ్మారు. అలాగే ఫరూఖ్‌కు ఎమ్మెల్సీ ఇవ్వడం, మహిళలకు ఇల్లు, కుట్టు మిషన్లు పంపిణీ వంటి తాత్కాలిక ఆకర్షణల ముందు వై.యస్. కల్పించిన మైనార్టీలకు 4శాతం రిజర్వేషన్‌ను మరచిపోయారు. వైశ్యులు, కాపులే కాదు, అభ్యర్థులిద్దరూ రెడ్లే కావడంతో వైకాపాకు బలమైన మద్దతుదారులుగా వున్న రెడ్లు కూడా చెరి సమంగా చీలిపోయారు. దీనికితోడు పోలీసులు, అధికారుల సహకారం, భూమా పిల్లల పట్ల కొంతమందిలో వున్న సానుభూతి కూడా కలిసొచ్చింది. అలాగే మొదటి నుండి కూడా... బూత్‌ల వారీగా ఓట్ల వివరాలు తెలుస్తాయి, మీరు ఓట్లు ఎవరికి వేసింది తెలిసిపోతుంది... మేం ఓడిపోతే మీకు పింఛన్ కట్, రేషన్ కట్, ప్రభుత్వ పథకాలు కట్... అంటూ అధికారపార్టీ నాయకులు వీధి వీధినా చేసిన ప్రచారం కూడా ఓటర్లపై బాగానే ప్రభావితం చేసింది.

### ఈ గెలుపే రేపటికి ప్రామాణికమా?

ఏ రాష్ట్రంలో ఉపఎన్నికలు జరిగినా సాధారణంగా అధికారపార్టీనే గెలుస్తుంటుంది. ప్రతిపక్షాలు గెలిచిన సందర్భాలు చాలా తక్కువ. అదికూడా అనుకోని పరిస్థితుల వల్ల. నంద్యాల గెలుపును చూసి చంద్రబాబు చంకలు గుద్దుకున్నా, ఓటమిని చూసి జగన్ డీలా పడినా ఇద్దరూ పప్పులో కాలేసినట్లే! నంద్యాల ఎలక్షన్‌ను సాధారణ ఎన్నికల మాదిరిగానే జరిపి, ఎటువంటి ప్రలోభాలు పెట్టకుండా తెలుగుదేశం గెలిచి వుంటే అది చంద్రబాబు నాయకత్వ సమర్థతకు ప్రజలు ఇచ్చిన బహుమానంగా వుండేది. రేపు అధికారం కూడా అతనిదేననే అభిప్రాయం ఉండేది. ఇంత చేసి గెలిచింది కూడా ఓ గెలుపేనా? అనే స్థాయిలో అక్కడ ప్రలోభాలు పని చేసాయి. కాబట్టి గెలుపును చంద్రబాబు తన బలుపుగా చూడనక్కర్లేదు. ఓటమిని జగన్ అంత జీర్ణించుకోలేనంతగా భావించనక్కర్లేదు. దీనికి చంద్రబాబే ఉదాహరణ. 2012లో రాష్ట్రంలో 15అసెంబ్లీలకు ఉపఎన్నికలు జరిగితే తెలుగుదేశంకు డిపాజిట్లు కూడా దక్కలేదు. అలాంటి పార్టీ 2014లో ఏకంగా అధికారంలోకి వచ్చింది. రాజకీయాలలో పరిస్థితులు మారడానికి ఒక్క నెల చాలు. 2014లో కేవలం రెండు నెలల వ్యవధిలోనే చంద్రబాబు రాష్ట్ర రాజకీయాలను మార్చేసాడు. కాబట్టి నంద్యాల ఉపఎన్నికల్లో గెలుపోటముల ద్వారా ఎవరికీ ఒరిగింది లేదు... తరిగిందీ లేదు.!

## ఆలయాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

### కమలానందభారతి స్వామీజీ

దేవాలయాలను ఎల్లప్పుడూ పరిశుభ్రంగా ఉంచుకోవాలని, ఆలయాల్లో భగవంతునికి నిత్యం పూజలు చేయడం వల్ల ఆయా ప్రాంతాల్లోని ప్రజలకు సుఖసంతోషాలు కలుగుతాయని కమలానందభారతి స్వామీజీ అన్నారు. హిందూ సంస్కృతిని, సంప్రదాయాలను ప్రజలకు వివరించేందుకు ప్రారంభించిన రథయాత్రలో భాగంగా స్వామీజీ గత నెల 28న వెంకటగిరి మండలంలోని గొల్లగుంట తదితర గ్రామాల్లో పర్యటించి పలు దేవాలయాలను సందర్శించారు. వచ్చేఏడాది ఫిబ్రవరి 14వ తేదిన తిరుమలలో లక్ష్య హోమంతో ఈ యాత్ర పూర్తవుతుందన్నారు. అనంతరం హిందూ ధర్మం విశిష్టతపై పలు విషయాలను ఆయన ప్రజలకు బోధించారు.

పర్యావరణ పరిరక్షణకు

## జనపనార సంచులు వాడండి



పర్యావరణ కాలుష్యం అరికట్టేందుకు అందరూ జనపనార సంచులు వాడాలని మార్కెటింగ్ ఏ.డి ఉపేంద్రకుమార్ అన్నారు. గత నెల 26వ తేదీ నెల్లూరు మద్రాసు బస్టాండ్ వద్ద గల వ్యవసాయ మార్కెటింగ్ సొసైటి కార్యాలయం వద్ద నిహా జ్యూట్ క్రియేషన్స్ అధినేత్రి కుసుమకుమారి ఆధ్వర్యంలో ప్రజలకు ఉచితంగా జనపనార(జ్యూట్) బ్యాగులు పంపిణీ చేశారు. ఈ బ్యాగులను ఏడి ఉపేంద్రకుమార్ అందజేశారు. అనంతరం పడారుపల్లిలోని ఆచార్య పి.సి.రెడ్డి సమాజమందిరంలో ఈ జ్యూట్ బ్యాగులను వికలాంగులు, విద్యార్థులు, వృద్ధులకు ఉచితంగా అందజేశారు. కుసుమకుమారి మాట్లాడుతూ నెల్లూరు కరెంటాఫీసు సెంటర్ సమీపం పోస్టల్ కాలనీ 6వ వీధిలో తమ జ్యూట్ బ్యాగుల పరిశ్రమ ఉందన్నారు. ఒక జ్యూట్ బ్యాగ్ వాడితే వెయ్యి ప్లాస్టిక్ కవర్లను ఆపవచ్చని పేర్కొన్నారు.

సింహపురి సమాచారం

## ప్రజా సమస్యలు పరిష్కరించండి

### అధికారులకు సూచించిన గూడూరు తహశీల్దార్

ప్రతి సోమవారం జరిగే ప్రజావిజ్ఞప్తుల రోజునాడు అన్ని శాఖలకు చెందిన మండల స్థాయి అధికారులు తప్పక హాజరై ప్రజల సమస్యలను పరిష్కరించాలని గూడూరు తహశీల్దార్ వెంకటేశ్వర్లు సూచించారు. గూడూరు తహశీల్దార్ కార్యాలయంలో సోమవారం గ్రీవెన్స్‌డే సందర్భంగా మండలంలోని అన్ని శాఖల అధికారులతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికారుల పర్యవేక్షణలో ప్రజల సమస్యలు పరిష్కరిస్తే సంక్షేమ పథకాలు సమర్థవంతంగా అమలు చేసే వీలుంటుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఏడీఏ శివనాయక్, ఎవో నాగమోహన్, గృహ నిర్మాణశాఖ, జలవనరులశాఖ ఏఇలు చంద్రశేఖర్‌రాజు, శ్రీనివాసులు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

కలవకొండ గ్రామంలో...

## తాగునీటి సమస్య తీర్చండి

చిల్లకూరు మండలం కలవకొండ గ్రామానికి చెందిన ఎస్సీలు తాగునీటి సమస్యలను పరిష్కరించాలని సోమవారం ఎమ్మార్పీఎస్ నాయకుడు మందా కృష్ణయ్య ఆధ్వర్యంలో గూడూరు ఆర్డీవో అరుణ్‌బాబుకు వినతిపత్రాన్ని అందించారు. గ్రామానికి చెందిన మహిళలు, స్థానికులు అధిక సంఖ్యలో వచ్చి గుక్కెడు తాగునీటి కోసం తాము పడుతున్న అవస్థ గురించి వివరించారు. ఏళ్ల తరబడి గ్రామంలో ఎస్సీలకు చెందిన భూములకు హద్దులను చూపాలని కోరినా నేటికీ సమస్య పరిష్కారం కాలేదని వాపోయారు. తక్షణం స్పందించి న్యాయం చేయాలని కోరారు.

## కోటంరెడ్డిపై కుట్ర?

(మొదటి పేజీ తరువాయి)

ఇదంతా ఒకెత్తయితే క్రికెట్ బెట్టింగ్ కేసు కేంద్రంగా వైకాపాలోనే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డిపై ప్రత్యర్థులు రాజకీయ కుట్ర చేస్తున్నట్లు తెలుస్తోంది. కోటంరెడ్డికి రాజకీయ రెబల్ స్టార్ అనే పేరుంది. ప్రత్యర్థి పార్టీల నేతలతోనే కాదు, అవసరమైతే సొంత పార్టీ వాళ్లతోనూ పోరాడగలడు. ఒక సాధారణ కుటుంబం నుండి రాజకీయాల్లోకొచ్చాడు. సామాన్యుడిగానే వుంటూ సామాన్యుల ఓట్లతోనే ఎమ్మెల్యే స్థాయికి ఎదిగాడు. గతంలో కాంగ్రెస్‌లో వున్నప్పుడు ప్రజాసమస్యల విషయంలోగాని, అవినీతి అక్రమాల విషయంలోగాని సొంత పార్టీ నాయకులతోనే పోరాడిన చరిత్ర అతనిది. ఇప్పుడు వైకాపాలోనూ అదే పరిస్థితి. ఎప్పుడూ ప్రజల మధ్య వుండే కోటంరెడ్డి అంటే ఇద్దరు నాయకులకు పడదు. ఒకాయన వై.యస్, ఆ తర్వాత జగన్ ఇమేజ్‌తో గెలుస్తున్న పార్లమెంట్ సభ్యుడైతే, ఇంకొకాయన కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి రాజకీయ చాణక్యంతోనే 'జిల్లా' స్థాయిలో పేరుపొందిన నాయకుడు. వీళ్లిద్దరి కంబైన్డ్ టార్గెట్ కోటంరెడ్డి. 2014 ఎన్నికల్లో కూడా కోటంరెడ్డికి నెల్లూరురూరల్ సీటు రాకుండా చేయడానికి వీరు చేయని ప్రయత్నమంటూ లేదు. కాని కోటంరెడ్డి శ్రమ, ప్రజల్లో అతనికున్న ఆదరణను గుర్తించి జగనే నేరుగా ఆయనకు సీటిచ్చాడు. ఈ నాయకులిద్దరు కూడా మరోసారి కోటంరెడ్డికి వ్యతిరేకంగా కుట్ర పన్నుతున్నట్లు తెలుస్తోంది. బెట్టింగ్ కేసులో వైకాపా ఎమ్మెల్యేలు ఇద్దరుంటే వీళ్ళు మాత్రం కేసు నుండి అనిల్‌కుమార్‌ను బయటేయాలని, కోటంరెడ్డిపై కేసు పెట్టుకున్నా ఇబ్బంది లేదని పోలీసు శాఖకే సంకేతాలు పంపినట్లు తెలుస్తోంది.

ఇప్పటికే పార్లమెంట్ స్థాయి నాయకుడి వల్ల పార్టీ గబ్బు పడుతోంది. గత ఎన్నికల్లో ఆయన నిర్వాకం వల్లే ఉదయగిరి, కోవూరు సీట్లలో వైకాపా ఓడిపోయింది. ఇలాంటి చెత్త రాజకీయాలను వీళ్ళు మానుకోకపోతే అది పార్టీకే తీరని చేటు తెస్తుంది.

## టీడీపీ కార్యాలయంలో...
# నంద్యాల సంబరం



గురువారం నెల్లూరులోని తెలుగుదేశంపార్టీ జిల్లా కార్యాలయంలో ఆ పార్టీ కార్యకర్తలు నంద్యాల విజయోత్సవ సంబరాలను నిర్వహించారు. నంద్యాల ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ తరపున స్పెషల్ ఆఫీసర్‌గా పని చేసిన రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ఈ వేడుకల్లో పాల్గొని విజయోత్సవ కేక్‌ను కట్ చేశారు. ఈ వేడుకల్లో ఎమ్మెల్సీ, పార్టీ జిల్లా అధ్యక్షుడు బీద రవిచంద్ర, జిల్లా కేంద్ర సహకార బ్యాంకు ఛైర్మెన్ మెట్టుకూరు ధనుంజయరెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మెన్ కిలారి వెంకటస్వామినాయుడు, ప్రభుత్వాసుపత్రి అభివృద్ధి కమిటి ఛైర్మెన్ చాట్ల నరసింహారావు, తెలుగుదేశం నాయకులు బెజవాడ ఓబుళరెడ్డి, గూటూరు కన్నబాబు, కార్పొరేటర్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కార్యకర్తలు సోమిరెడ్డిని పూలమాలలతో సత్కరించారు.

# శ్మశాన వాటికలో ప్రారంభోత్సవాలు



ఇటీవల నెల్లూరు బోడిగాడితోటలోని రోటరీ క్లబ్ శ్మశాన వాటిక నందు సుమారు 20లక్షల వ్యయంతో నిర్మించిన కర్మకాండ మండపం, క్షవర మండపం, నీళ్లబోరును ప్రారంభించారు. దాతలు గంటా రమణయ్యనాయుడు, రొటేరియన్ దొరస్వామినాయుడు, కుమార్ జ్యూయలర్స్ వారి సహకారంతో వీటిని నిర్మించారు. ఈ కార్యక్రమంలో రోటరీ క్లబ్ ఛైర్మెన్ రాఘవేంద్రషెట్టి, కోశాధికారి పి.వెంకటేశ్వర్లు, రోటరీ మాజీగవర్నర్ దొడ్ల భరత్‌కుమార్‌రెడ్డి, అధ్యక్షులు బి.వెంకటేశ్వర్లురెడ్డి, కార్యదర్శి నారపశెట్టి నారాయణ, బి.శ్రీహరిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# రైతులకు సంపూర్ణ సహకారం

నెల్లూరుజిల్లా కేంద్ర సహకార బ్యాంక్ ద్వారా సహకార రైతు వికాస పథకం క్రింద 5వేల మంది రైతులకు రూ.180 కోట్లు రుణాలుగా అందించినట్లు సహకార బ్యాంకు ఛైర్మెన్ మెట్టుకూరు ధనుంజయరెడ్డి తెలిపారు. బుధవారం బ్యాంకులోని తన ఛాంబర్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సెప్టెంబర్ 8న బ్యాంకు 100ఏళ్ల పండుగను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నష్టాల్లో వున్న బ్యాంక్‌ను ఆదాయంలోకి తీసుకువచ్చినట్లు పేర్కొన్నారు. కొన్ని సొసైటీలు నష్టాల్లో వున్న మాట వాస్తవమని, 2018కల్లా వాటిని కూడా లాభాల బాటలోకి తీసుకువస్తామన్నారు. గతంలో ఈ బ్యాంక్ రూ.8కోట్ల నష్టాల నుంచి కోటిన్నర లాభాల్లోకి చేరిందని, మద్దూరుపాడు సహకార సంఘం




బ్యాంకునకు రిసీడ్ చేసుకునేందుకు పాలక వర్గం ఆమోదం లభించడం, దువ్వూరు పిఏసిఎస్ కాన్ఫరెన్స్ హాల్ నిర్మాణానికి రూ.10.50 లక్షలు, మల్లాంకు 50లక్షలు క్యాష్ క్రెడిట్ క్రింద రుణం మంజూరు చేశామన్నారు.

## 7న ఏపి రాష్ట్ర సహకార బ్యాంక్ బోర్డు సమావేశం

సెప్టెంబర్ 7న ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సహకార బ్యాంక్ బోర్డు సమావేశం నెల్లూరు కేంద్ర సహకార బ్యాంకు ఆవరణంలో జరుగుతుందని, ప్రతి ఏటా విజయవాడలో జరిగే ఈ సమావేశం ఈసారి నెల్లూరులో జరుగుతుందన్నారు. ఈ సమావేశానికి 13జిల్లాల సహకార బ్యాంకు ఛైర్మెన్లు, అధికారులు పాల్గొంటారని తెలిపారు. ఈ సమావే శంలో బ్యాంక్ వైస్‌ఛైర్మెన్ నల్లపరెడ్డి జగన్ మోహన్‌రెడ్డి, డైరెక్టర్ కోడూరు కమలా కర్‌రెడ్డి, బుర్రా వెంకటేశ్వర్లు గౌడ్, చిట్టమూరు వెంకటశేషారెడ్డి, శివరామ కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

# ఇస్కాన్‌లో శ్రీరాధాష్టమి వేడుకలు



నెల్లూరు కొండాయపాళెంరోడ్డు ఇస్కాన్ సిటిలోని ఇస్కాన్ మందిరంలో మంగళవారం శ్రీ రాధాష్టమి వేడుకలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా ఇస్కాన్ మందిర అధ్యక్షుడు డాక్టర్ సుఖదేవస్వామి ఉపన్యసిస్తూ ఆధ్యాత్మిక ఆనందంతోనే నిజమైన ఆనందం పొందగలరన్నారు. భౌతిక ఆనందం భ్రాంతిమయమన్నారు. భగవన్నామ స్మరణం ద్వారా భ్రాంతి నుంచి బయటపడగలమన్నారు. హరేకృష్ణ మహామంత్రం రాధాకృష్ణుల బీజమంత్రంగా వివరించారు. ఆదిపురుషుడైన శ్రీకృష్ణ పరమాత్ముడు రామ, నరసింహ, విష్ణుమూర్తి అవతారాలుగా, రాధారాణిని ఆనందాన్ని అందించే హ్లాదిని శక్తిగా వివరించారు. భగవన్నామస్మరణ ద్వారా భ్రాంతి నుంచి బయటపడాలన్న సంకల్పంతో ఇస్కాన్ వ్యవస్థాపకులు శ్రీల ప్రభుపాదుల వారు ప్రపంచమంతా గీత-కృష్ణ మంత్రాన్ని ప్రచారం చేసారన్నారు. మందిరంలో కొలువైన శ్రీకృష్ణ బలరామ సుభద్ర, రాధాకృష్ణులకు విశేష అలంకరణ, అభిషేకాలు భక్తి శ్రద్ధలతో పూజలు నిర్వహించారు. అనంతరం రాధాకృష్ణులకు చప్పన్‌భోగ్ నివేదన చేశారు. భక్తులు విశేషంగా పాల్గొన్నారు. ఉభయకర్తలుగా గంటా రమణయ్య, వెంకటరెడ్డి, తులసమ్మ వ్యవహరించారు.

## పిఎస్ఎల్వి-సి39
# విఫలం



చాలా ఏళ్ళ తర్వాత రాకెట్ ప్రయోగాల పరంపరలో ఇస్రోకు ఎదురుదెబ్బ తగిలింది. వరుస విజయాలతో ఊపు మీదున్న ఇస్రోకు పిఎస్ఎల్వి-సి39 రూపంలో పరాజయం ఎదురైంది. ఆగస్టు 31వ తేదీ శ్రీహరికోటలోని సతీష్‌ధావన్ అంతరిక్ష ప్రయోగ కేంద్రం నుండి ప్రయోగించిన పిఎస్ఎల్వి-సి39 విఫలమైంది. రాకెట్ మూడు దశలను విజయవంతంగా అధిగమించి 4వ దశ జరుగుతున్న సమయంలో రాకెట్ నుండి ఉపగ్రహం విడిపోక పోవడంతో ప్రయోగం విఫలమైనట్లు శాస్త్రవేత్తలు గుర్తించారు. సాంకేతిక వైఫల్యాలతో ప్రయోగం విఫలమైనట్లు ఇస్రో ఛైర్మెన్ కిరణ్‌కుమార్ ప్రకటించారు.




**జక్కా హర్షవర్ధన్‌రెడ్డి**

జననం: 04.10.1957 మరణం: 07.09.1997

శ్లో॥ నైనం ఛిందంతి శస్త్రాణి నైనం దహతి పావక: ॥
నచైనం క్లేదయంత్వాపో నశోషయతి మారుత: ॥ (గీత)

## సంస్మరణ

మా అందరిలో ఒకడిగా, మాకందరికీ తోడుగా
నీవు లేని ఈ లోకం, రూపుదాల్చిన శోకం!
మా గుండెల్లో గుడి కట్టి పదిలంగా నిలిచావు.
మా హృదయాల్లో కలకాలం జీవించే ఉంటావు!!

నీ స్మృతిలో...

స్వప్న - భార్య

జె.వి.రెడ్డి - తండ్రి
జానకి - తల్లి

కుమార్తెలు - అల్లుడు
సంజన - కుషాన్
సుస్మిత

చెల్లెలు - బావ
శరణ్య - డా॥ అశోక్

మేనల్లుడు - మేనకోడలు
అశ్విన్ - షీనా

మరియు
కుటుంబసభ్యులు

## 'ప్రభా'తం

జనం అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకుని, వారి బలహీనతలను అలుసగా తీసుకుని గుర్మీత్‌సింగ్ అలియాస్ డేరాబాబా వంటి కిరాతక బాబాలు వస్తూనే ఉంటారు. ప్రజలను అడుగడుగునా వంచించే మోసగాళ్ళు, నయవంచన చేసే మాయగాళ్ళు కుప్పలుతెప్పలుగా పుట్టుకొస్తూనే ఉంటారు. అయినా, మనదేశంలో ఇలాంటి దొంగబాబాలకు కొదవే లేదు. నమ్మే అమాయకులుండగా, నమ్మించి నట్టేట ముంచడానికి ఎల్లవేళలా అలాంటి బాబాలు సిద్ధంగా తయారై ఉంటారు. ఇక కొంతమంది నాయకులైతే అలాంటి వంచక బాబాలకే సాష్టాంగపడుతుండడం మనకు విడ్డూరమైనా..వారికది సర్వసాధారణమైన విషయమే. అయినా, ఎప్పటికైనా పాపాలు పండకపోవు. డేరాబాబా పాపాలు కూడా పండాయి. తనకు తానే దైవసమానునిగా ప్రకటించుకున్న డేరాబాబా ఇప్పుడు చేసిన పాపాలు తలచుకుంటూ కటకటాలు లెక్కబెట్టుకుంటున్నాడు. రాజస్థాన్‌లోని శ్రీగంగానగర్ జిల్లాలోని శ్రీ గురసర్ మోదియా గ్రామంలో 1967లో జన్మించిన గుర్మీత్‌సింగ్ (డేరాబాబా) హరియాణాలో గొప్ప ఆధ్యాత్మికబోధకునిగా, దాతగా, ఆటగాడు-పాటగానిగా, నటుడు, దర్శకునిగా, రచయితగా పేరొందాడు. రాక్‌స్టార్‌గా ప్రఖ్యాతిచెందాడు. హర్యానాలోని సిర్సాలో ఓ వెయ్యిఎకరాల్లో ఆశ్రమం నిర్మించుకున్నాడు. ఇక్కడే అసలు వ్యవహారాలు జోరందుకున్నాయి. అరాచకాలు, అత్యాచారాలు, అకృత్యాలు, అసాంఘిక కార్యకలాపాలకు, రకరకాల హింసోన్మాద కార్యక్రమాలకు ఈ ఆశ్రమం వేదికైంది. చేసిన పాపాలే డేరాకు శాపాలయ్యాయి. తాను చేసిన ఘోరాలే చివరకు తన మెడకు ఉచ్చులా తగులుకున్నాయి. తనను నమ్మివచ్చిన ఇద్దరు భక్తురాళ్ళపై అత్యాచారం చేశాడన్న కేసులో డేరాబాబాకు ఇరవై ఏళ్ళ జైలుశిక్ష పడింది. ఇప్పుడు జైలు ఊచలు లెక్కబెట్టుకుంటున్న డేరాబాబా, అంతకు ముందుదాకా చేసిన నేరాలు, ఘోరాలు, అకృత్యాలు, కిరాతకత్వాలు ఒక్కొక్కటిగా ఇప్పుడు వెలుగులోకి వస్తుండడం, డేరాబాబా తన శిష్యులను, అనుచరవర్గాలను ఎలా ఉపయోగించుకునేవాడో, భక్తురాళ్ల పట్ల ఎలా హీనంగా వ్యవహరించేవాడో, తనను వ్యతిరేకించిన వారిపట్ల ఎంత కిరాతకంగా వ్యవహరించేవాడో రకరకల కథనాలు వింటుంటే ఒళ్ళు జలదరిస్తుంటుంది. నమ్మినవారిని మోసగించడం, భారీగా ఆస్తులను పెంచుకోవడం, ధనగర్వంతో వందలాదిగా అనుచరులను నియమించుకోవడం, తన వ్యతిరేకులను గుట్టుచప్పుడుగా హతమార్చడం, ఆ హత్యలను గుర్తుతెలియని వ్యక్తులెవరో చేసినట్లుగా ప్రచారంలోకి తేవడం, నాయకులను సైతం లోబరుచుకోవడం, పైకి భక్తితో..లోపల కిరాతకత్వంతో ప్రజలను వంచించడం డేరాబాబా లీలల్లో కొన్నిభాగాలు మాత్రమే. పంజాబ్, ఢిల్లీ, హరియాణా, రాజస్థాన్ తదితర ప్రాంతాలకు బాగా విస్తరించిన డేరా బాబా ప్రాబల్యం అంతా ఇంతా కాదు. సుమారు అయిదుకోట్ల మంది డేరాబాబాకు అనుయాయులుగా ఉన్నారంటే డేరాబాబా సత్తా ఎలాంటిదో తెలుస్తుంది. ఆ మాయగాడిపై కేసులున్నా ప్రభుత్వాలు పట్టించుకోకపోవడమే కాక, పైపెచ్చు అతనికి జడ్‌ప్లస్ సెక్యూరిటీని కూడా కల్పించి తమ భక్తిప్రపత్తులు చాటుకోవడం కంటే విడ్డూరం ఇంకేమి కావాలి?.. డేరాబాబా ప్రభావం అలాంటిదన్నమాట. ఏదైతేనేం, ఆధ్యాత్మిక ముసుగులో అకృత్యాలు చేస్తూ, భక్తురాళ్ళ పట్ల అత్యంత హేయంగా వ్యవహరించిన ఆ కర్కోటకునికి సిబిఐ న్యాయస్థానం 20 ఏళ్ళ జైలుశిక్ష విధించి ప్రజలందరి ప్రశంసలు అందుకుంటోంది. అంతేకాదు, రెండు కేసుల్లోనూ ఒక్కోదానికి 15 లక్షల వంతున జరిమానా కూడా విధించారు. ఆ డబ్బులో 14 లక్షలను ఒక్కో బాధితురాలికి చెల్లించాలని బాధితురాళ్లకు ఓదార్పుగా న్యాయమూర్తి మానవీయమైన తీర్పు చెప్పడం ప్రజలకు సంతోషం కలిగిస్తోంది. కాగా, ఇన్నాళ్లూ తనకు ఎదురేలేదనుకున్న డేరాబాబాకు, హింసోన్మాదులైన ఆయన అనుచరగణాలకు సిబిఐ న్యాయస్థానం విధించిన శిక్షతో దిమ్మతిరిగినట్లయింది. దీంతో డేరాబాబా గుడారం ఎత్తేసినట్లయింది. "తన వద్దకు వచ్చే మహిళా భక్తురాళ్ళపైనే నిందితుడు లైంగిక దాడికి పాల్పడ్డాడు. తనకు లొంగకపోతే తీవ్ర పరిణామలుంటాయని బెదిరించాడు. ఈ కేసుకే ప్రత్యేకమైన వాస్తవాలు, పరిస్థితులను దృష్టిలో ఉంచుకుంటే, ఇటువంటి వ్యక్తులు కోర్టు నుంచి ఎలాంటి కారుణ్యానికి అర్హులు కారు. తనపై ఎంతో భక్తివిశ్వాసాలు కలిగిన తన సొంత శిష్యురాళ్ళను కూడా నిందితుడు వదలలేదు. ఒక అడవి మృగంలా ప్రవర్తించాడు. బాధితులు ఇద్దరూ గుర్మీత్‌ను దైవదూతగానే భావించారు. ఆ విధంగానే ఆయనను పూజించారు. అటువంటి వారిపై లైంగిక దాడికి పాల్పడడం ద్వారా గుర్మీత్ తీవ్ర నేరానికి పాల్పడ్డాడని"..కుండబద్దలు కొట్టినట్లు సిబిఐ న్యాయమూర్తి స్పష్టం చేశారు. డేరాబాబా వ్యక్తిత్వం ఎంత హీనమైనదో, ఎంత ఘోరమైనదో ప్రపంచానికే కాక, డేరా బాబాను గుడ్డిగా పూజించేవారందరికీ తేటతెల్లమైపోయింది. ఇలాంటి తీర్పు వస్తుందని ఊహించిన డేరాబాబా అనుచరగణాలు అటు హర్యానా, పంజాబ్ రాష్ట్రాల్లో చేసిన విధ్వంసం అంతా ఇంతా కాదు. ఈ విధ్వంసకాండలో 38 మంది మరణించారు కూడా. ప్రధాని మోడీ ఇలాంటి విధ్వంసాలను దృష్టిలో పెట్టుకుని హింసోన్మాదులకు స్పష్టమైన హెచ్చరికలు చేశారు. "ఎవరైనా సరే, మతం పేరుతో హింసకు పాల్పడితే సహించేది లేదని, అది మతపరమైన విశ్వాసమైనా, ఒక రాజకీయ సైద్ధాంతికను అనుసరించడమైనా, ఒక వ్యక్తికి లేదా సంప్రదాయానికి విధేయత ప్రకటించడమైనా..ఏదైనా కానీయండి, హింసకు దిగితే మాత్రం ఊరుకునేది లేదని, విశ్వాసం పేరుతో చట్టాన్ని తమ చేతుల్లోకి తీసుకునే హక్కు ఎవరికీ లేదని"..ప్రధాని స్పష్టం చేశారు. అందుకు తగ్గట్టుగానే ఈ ఘటనలపై కఠినచర్యలు ప్రారంభం కావడం హర్షదాయకం. ఏదేమైనా, డేరాబాబా వంటి దొంగబాబాల పట్ల ఎల్లవేళలా ప్రజలు జాగ్రత్తగా ఉండడమే శ్రేయస్కరం. అమాయకత్వంతో, మూఢభక్తితో ఉండడం.. దెయ్యాల్లాంటి దొంగబాబాలని..దైవాలుగా నమ్మడం ఎంతైనా ప్రమాదకరం. అలాంటి మాయగాళ్ళ పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని డేరాబాబా ఉదంతం చెప్పకనే చెప్తుంది. కనుక..తస్మాత్ జాగ్రత్త!

### పాపాల భైరవుడికి కటకటాలు



తనను తానే దైవసమానునిగా ప్రకటించుకుని, తనను నమ్మిన భక్తురాళ్ళపైనే అత్యాచారానికి పాల్పడిన రాజస్థాన్ రాక్‌స్టార్ గుర్మీత్ రాంరహీమ్ సింగ్ (డేరా బాబా)కు సిబిఐ న్యాయస్థానం 20ఏళ్ళ జైలుశిక్ష విధించి సంచలనం సృష్టించింది. దీంతో, ఆధ్యాత్మికత్వం ముసుగులో ఆ నయవంచకుడు చేస్తున్న బండారం బట్టబయలైంది. ప్రజలు మూఢనమ్మకాలతో.. అమాయకత్వంతో డేరాబాబా వంటి దొంగబాబాలను నమ్మడం ప్రమాదకరం. ఇలాంటి మాయగాళ్ళ పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి.

---

భక్తి ముసుగులో...

## బాబాల అకృత్యాలు సిగ్గు చేటు

భక్తి ముసుగులో బాబాలు చేస్తున్న అకృత్యాలు సిగ్గుచేటని జనవిజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షుడు పి.బుజ్జయ్య పేర్కొన్నారు. అనేకమందిపై అత్యాచారాలు చేసిన డేరా బాబా రామ్‌రహీం గుర్మత్‌సింగ్‌ను కఠినంగా శిక్షించాలని సోమవారం జేవివి కార్యకర్తలు నెల్లూరు గాంధీబొమ్మ సెంటర్ నుంచి వీఆర్‌సి సెంటర్ వరకు ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా బుజ్జయ్య మాట్లాడుతూ డేరాబాబా చేసిన అకృత్యాలు లెక్కలేనన్ని ఉన్నాయన్నారు. తన వద్ద ఉండే 400మంది మగవారికి వృషణాలు లేకుండా చేసిన ఘనుడు డేరాబాబా అన్నారు. అవినీతిని వెలికి తీసినందుకు జర్నలిస్టులను సైతం అడ్డు తొలగించుకున్నాడని తెలిపారు. ఆధ్యాత్మిక ముసుగులో వ్యభిచారం చేయడం దారుణమన్నారు. ఆశ్రమంలో పిస్తోళ్ళు, తుపాకులు ఉన్నాయంటే రాజ్యాంగాన్ని ఏమేరకు గౌరవిస్తున్నారో ప్రజలు అర్థం చేసుకోవాలని కోరారు. రాజ్యాంగాన్ని కాలరాస్తున్న డేరాబాబా లాంటి వారిని కఠినంగా శిక్షించేందుకు చట్టాల్లో మార్పు చేయాలని కోరారు. బాబా మద్దతుదారులు నాలుగు రాష్ట్రాల్లో దాదాపు మూడువేల కోట్ల రూపాయల విలువైన ఆస్తులను నాశనం చేస్తుంటే పాలకులు ఏమి చేస్తున్నారని ప్రశ్నించారు. వేదిక ఆరోగ్య సబ్ కమిటి జిల్లా కన్వీనర్ డాక్టర్ శ్రీను నాయక్, నగర అధ్యక్ష, కార్యదర్శులు పి.విద్యాచరణ్, మాదాల రాము, న్యాయవాది అంకయ్య, డాక్టర్ రాజేశ్వరరావు, శివరాం, మోహన్‌రెడ్డి, ప్రమీలమ్మ, కృష్ణ, బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## పెంచలకోనలో 3 నుంచి పవిత్రోత్సవాలు

జిల్లాలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన పెంచలకోనలోని శ్రీ పెనుశిల లక్ష్మీనృసింహస్వామి ఆలయంలో సెప్టెంబర్ 3వ తేది నుంచి 6వ తేది వరకు పవిత్రోత్సవాలు నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా ఆలయ ఇ.ఓ శ్రీరామమూర్తి పవిత్రోత్సవాల ప్రాశస్త్యాన్ని వివరించారు. ఆలయంలో నిర్వహించే సేవల్లో తెలిసీ, తెలియక ఏమైనా పొరపాట్లు జరిగితే అందుకు ప్రాయశ్చిత్తంగా, సకలదోషాలను నివారించేందుకు ఈ పవిత్రోత్సవాలను నిర్వహిస్తుంటామన్నారు. పవిత్రోత్సవాల్లో భాగంగా 3వ తేదిన విష్వక్సేనారాధన, పుణ్యాహవచనం, మృత్సంగ్రహణం, 4వ తేదీన కుంభారాధన, అగ్నిప్రతిష్ట, పవిత్రాల సమర్పణ, ప్రాకారోత్సవం, 5వ తేదిన వేదపారాయణాలు, హోమాలు నిర్వహిస్తామని, 6వ తేదిన స్వామివారికి శేషవాహనసేవ, శాంతి హోమం, మహాకుంభ ప్రోక్షణ, పూర్ణాహుతి నిర్వహిస్తామని వివరించారు.

---




## కఠినంగా అణచివేయాలి

15ఏళ్ల క్రితం జరిగిన రేప్ కేసులో డేరా సచ్చాసౌదా అధినేత గుర్మీత్ రాంరహీంసింగ్‌ను సిబిఐ కోర్టు దోషిగా ఖరారు చేస్తే ఆయన అనుచరులు పెను విధ్వంసం సృష్టించారు. దాదాపు 36మంది చావుకు కారణమయ్యారు. కోట్లాది రూపాయల ఆస్తులను ధ్వంసం చేశారు. ఈ విధ్వంసానికి పాల్పడ్డవారిని వూరికే వదలకూడదు. పట్టుకుని కఠినంగా శిక్షించాలి. ధ్వంసమైన ఆస్తులకు సంబంధించిన నష్టాన్ని వారి ఆస్తులమ్మి భర్తీ చేయించాలి. ఎన్నో అక్రమాలకు, లైంగిక వేధింపులకు నిలయమైన డేరా సచ్చాసౌధాను ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలి. బాబాలు, స్వామీజీలు తప్పులు చేసినా తప్పించుకు తిరగాల న్నట్లుగా వాళ్ల భక్తుల పోకడ వుంటోంది. ఈ మధ్య అశారాంబాపు అనే దొంగ స్వామీజీ విషయంలో కూడా ఇదే జరిగింది. ముందు దేశంలో దొంగబాబాలను, స్వామీజీలను అరికట్టాలి.

**సి. రాజీవి, నెల్లూరు.**

## ఇదీ ఒక గెలుపేనా?

నెల రోజులుగా ఉత్కంఠ రేపిన నంద్యాల అసెంబ్లీ ఉపఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ ఘనవిజయం సాధించింది. అయితే ఇక్కడే తెలుగుదేశం అధినేత చంద్రబాబు ఆత్మపరిశీలిన చేసుకోవాలి... ఇది కూడా ఒక గెలుపేనా? అని. ఒక్క నంద్యాల అసెంబ్లీ పరిధిలోనే 1400 కోట్ల రూపాయల పనులు మొదలుపెట్టారు. దాదాపు వంద కోట్లకు పైగా డబ్బు పంపిణీ చేశారు. ఇక అధికారపార్టీ చేసిన ఇతరత్రా అక్రమాలకైతే అంతే లేదు. ఇంత చేసి గెలిచిందీ ఓ గెలుపేనా? రేపు మిగతా 174 నియోజకవర్గాలలో కూడా ఇన్ని వందల కోట్ల అభివృద్ధి పనులు, ఇన్ని కోట్ల డబ్బులు పంపిణీ చేసి గెలవగలరా? కాబట్టి నంద్యాల గెలుపు చంద్రబాబుకు వాపేకాని, గెలుపు కాదు.

**– జి. శేఖర్, ఖాజీపేట.**

## సక్రమంగా వసూలు కాని పన్నులు

నెల్లూరు నగరంలో అనేక నివాసిత ప్రాంతాల్లో పూర్తి స్థాయిలో ఆస్థి పన్నులు వసూలు జరగడం లేదు. కొన్ని కాలనీలలో కొత్త ఇళ్ళకు ఇంకా ఆస్తి పన్ను విధించాల్సివుంది. నగరంలోని అన్ని ఇళ్ళను ఆస్థి పన్ను పరిధిలోకి తీసుకురావాలి. కొందరు మున్సిపల్ అధికారులు మామూళ్లకు అలవాటుపడి ఆస్థి పన్ను విధించే విషయంలో నగరపాలక సంస్థను మోసం చేస్తున్నారు. అధికారులు ప్రతి ఏటా సక్రమంగా పన్నులు చెల్లించే వారివద్దకే వచ్చి పన్నులు వసూలు చేస్తుంటారు. ఆస్థి పన్నులు కట్టని వారికి నగరపాలక సంస్థ పరంగా అన్ని సౌకర్యాలు నిలిపిస్తే అందరూ పన్నులు కడతారు.

**– పైడా శశి, నెల్లూరు.**

## వంతెన కావాలి

నెల్లూరు నగరంలో ఆత్మకూరు బస్టాండ్ వద్ద ఫ్లైఓవర్ బ్రిడ్జి వుంది. క్రింద ట్రాఫిక్ నేరుగా వదిలేసి వుండాలి. కాని ఇక్కడ స్టోన్‌హౌస్‌పేట వైపు వెళ్లే వాహనాలైనా, బోసుబొమ్మ వైపు వెళ్ళే వాహనాలైనా మలుపు తిరిగి రావాల్సి వస్తోంది. నగరంలో ఇప్పుడు రామలింగాపురం జంక్షన్ వద్ద విపరీతమైన ట్రాఫిక్ ఉంటోంది. నాలుగు రోడ్ల కూడలి కావడంతో తరచూ ట్రాఫిక్ సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. మినీబైపాస్‌రోడ్డు మీద ఇక్కడ ఫ్లైఓవర్ నిర్మించాలి. రామలింగాపురం వైపు నుండి ముత్తుకూరు రోడ్డు వైపు వెళ్లే వాహనాలు క్రింద రోడ్డు మీదనే నేరుగా వెళ్లేలా చేస్తే ట్రాఫిక్ బాధ తగ్గుతుంది. అలాగే పలు కూడళ్ళలో 'యూ'టర్న్‌లు ఏర్పాటు చేయడం వల్ల కూడా ప్రజలు ఇబ్బంది పడుతున్నారు.

**ఎల్. పరమేశ్వరరావు, నెల్లూరు.**




# స్వచ్ఛ నగరం

## రూపు మారుతున్న గోడలు.. అలరిస్తున్న అందాల నీడలు

*నెల్లూరు నగరం అంటేనే మురికి పందులు... ఇరుకు సందులు... ముదురుదోమలు... పేడదిబ్బలు... చెత్తకుప్పలు... కంపు కొట్టే కాలువలు... ఇంతేనా? అశ్లీల వాల్‌పోస్టర్‌లతో నిండిన గోడలు... వాణిజ్య సంస్థల ప్రకటనల రాతలతో గజిబిజిగా కనిపించే అండర్ బ్రిడ్జిలు... ఆయా మతాలకు సంబంధించిన పోస్టర్‌లతో నిండిపోయే ఐలాండ్‌లు.*

నెల్లూరుకు ఏ కమిషనర్ వచ్చినా వీటిని పెద్దగా పట్టించుకునే వాడు కాదు. నేను పట్టించుకున్నంత మాత్రాన ఇవి ఆగేవి కాదులే అని మిన్నకుండిపోయే వారు. కాని, కొత్త కమిషనర్ ఢిల్లీరావు అలా అనుకోలేదు. నెల్లూరును స్వచ్ఛ నగరంగా మార్చాలన్న లక్ష్యంపై దృష్టి పెట్టారు. ఆ దిశగా కృషి చేస్తున్నారు. పలు స్వచ్ఛంధ సంస్థలు ఆయన లక్ష్యానికి తోడ్పాటునందిస్తుండడం విశేషం.

నెల్లూరులో నాలుగు రైల్వే అండర్ బ్రిడ్జిలున్నాయి. గతంలో ఇవెప్పుడూ గలీజు రాతలతో, సినిమా పోస్టర్‌లతో కనిపించేవి. ఇప్పుడు ఇవే అండ్ బ్రిడ్జిలు ఆకర్షణీయంగా మారాయి. రామలింగాపురం అండర్‌బ్రిడ్జి జాతీయోద్యమ నేతల ముఖ చిత్రాలతో నిండిపోయింది. ఈ బ్రిడ్జి నుండి వెళుతూ ఆ చిత్రాలను చూస్తుంటే ఒక మంచి అనుభూతి ఏర్పడుతుంది. ఇక మాగుంట లే అవుట్ అండర్‌బ్రిడ్జిని కళాత్మక చిత్రాలతో ఆకర్షణీయంగా రూపొందించారు. తాజాగా విజయమహల్ గేటు బాక్స్‌టైపు బ్రిడ్జిని ఆకర్షణీయమైన రంగుల చిత్రాలతో చిత్రించారు. అలాగే ఆత్మకూరు బస్టాండ్ అండర్‌బ్రిడ్జిని కూడా అందమైన పెయింటింగ్‌లతో తీర్చిదిద్దనున్నారు. ఇక రైల్వేస్టేషన్ గోడతో పాటు నగరంలో మరికొన్ని ముఖ్యమైన గోడలను బ్రిడ్జిలను అందమైన పెయింటింగ్‌లతో అలంకరిస్తున్నారు. ఒకదాని తర్వాత ఒకటి నెల్లూరు నగరాన్ని ఇలా అందంగా ముస్తాబుచేసుకుంటూ పోతే నెల్లూరును తొందరగానే స్వచ్ఛనగరంగా చూడగలం.

# చాణుక్యుడనిపించాడు!




కాంగ్రెస్‌కు అహ్మద్ పటేల్, బీజేపీకి వెంకయ్యనాయుడు, సమాజ్‌వాదీ పార్టీకి అమర్‌సింగ్... ఇలా ప్రతి పార్టీకి వ్యూహకర్తలుండే వాళ్లు. పార్టీకి సంబంధించి ఎక్కడన్నా సమస్య వచ్చినా, లేదా మధ్యమధ్యలో ఎన్నికలు వచ్చినా తమ పార్టీ తరఫున యంత్రాంగాన్నంతా వీళ్ళు నడిపించేవాళ్ళు. ఇప్పుడు తెలుగుదేశంపార్టీకి కూడా అలాంటి వ్యూహకర్త దొరికాడు. అతనే వ్యవసాయశాఖామంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి.

2004 నుండి 2014 దాకా పదేళ్ల రాజకీయ చరిత్రను చూసుకుంటే సర్వేపల్లి నుండి మూడుసార్లు, కోవూరు ఉపఎన్నికల్లో ఒకసారి మొత్తం నాలుగుసార్లు వరుసగా ఓడిపోయాడు సోమిరెడ్డి. ఆయన రాజకీయ చాణక్యుడైతే, వ్యూహకర్త అయితే ఇన్నిసార్లు ఎందుకు ఓడిపోతాడనే సందేహం కూడా రావచ్చు. యుద్ధం చేసేవాడి కంటే యుద్ధం చేయించే వాడు చాలా ప్రభావం చూపుతాడు. యుద్ధం చేసేవాడికి ఒకే కోణం తెలిసివుంటుంది. యుద్ధం చేయించేవాడికి గెలుపు కోసం అనుసరించాల్సిన వ్యూహాలపై అనేక కోణాలు తెలిసుంటాయి. ఇప్పుడు సోమిరెడ్డి యుద్ధం చేయడం కంటే యుద్ధం చేయించి నెగ్గించే పాత్రలో బాగా రాణిస్తున్నాడు. మొన్న కడప స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల ఇన్‌ఛార్జ్‌గా వ్యవహరించిన సోమిరెడ్డి తన టాలెంట్ అంతా చూపాడు. వైసిపి కంచుకోటలో జగన్ చిన్నాన్న వై.యస్. వివేకానందరెడ్డిని ఓటమి పాల్జేయడంలో సోమిరెడ్డి నిర్విరామ కృషి చేశాడు. కడప ఎమ్మెల్సీ ఎన్నికలప్పుడే సోమిరెడ్డికి బాగా మార్కులు పడ్డాయి. కడపలో ఆయన టాలెంట్‌ను చూసిన చంద్రబాబుకు సోమిరెడ్డిపై నమ్మకం కుదిరింది. అదే నమ్మకంతో ఎంతో ప్రతిష్టాత్మకంగా భావించిన నంద్యాల ఎలక్షన్ బాధ్యతను కూడా అప్పగించాడు. నంద్యాలలో తెలుగుదేశం గెలుపు కోసం సోమిరెడ్డి తాను నిలబడ్డప్పుడు కూడా చేయనంతగా పని చేశాడు. నంద్యాలలోనే తిష్ట వేశాడు. రాత్రింబవళ్ళు పని చేశాడు. నంద్యాలలో సందు సందు గురించి తెలుసుకున్నాడు. ఏ వీధిలో ఏ నాయకుడున్నాడు, ఎవరి వద్ద ఓట్లున్నాయి, ఎవరు చెబితే ఓట్లేస్తారన్న వివరాలన్నీ రాబట్టాడు. అందర్నీ తన బుట్టలోకి లాక్కున్నాడు. కర్నూలు జిల్లా నాయకులకు కూడా సోమిరెడ్డి రాజకీయం నేర్పించాడు. ఎలక్షన్ ఎలా చేయాలో చూపించాడు. నంద్యాలలో తెదేపాకు భారీ ఆధిక్యం సాధించి పెట్టడం ద్వారా తన విలువేంటో చంద్రబాబుకు తెలిసొచ్చేలా చేసాడు.

# ఇక... ఎర్రస్మగ్లర్ల వంతు

**జిల్లాలో బెట్టింగ్‌రాయుళ్లను పట్టుకుని ఉతికి ఆరేసిన జిల్లా ఎస్పీ పి హెచ్‌డి రామకృష్ణ తాజాగా ఎర్రచందనం స్మగ్లర్లపై కూడా దృష్టిపెట్టారు.**





చిత్తూరు – కడప జిల్లాల తర్వాత నెల్లూరుజిల్లానే ఎర్ర చందనం స్మగ్లర్లకు పెద్ద అడ్డా! జిల్లాలోని రాజకీయ నాయకులతోనూ స్మగ్లర్లకు సంబంధాలున్నట్లు గతంలోనే బహిర్గతమైంది. 2015లో జిల్లా ఎస్పీగా పనిచేసిన సెంథిల్‌కుమార్ ఎర్రచందనం స్మగ్లర్ల పీచమణిచాడు. స్మగ్లర్‌లతో సంబంధాలున్న రాజకీయ నాయకుల బండారాన్ని బయటపెడతాడనుకున్న తరుణంలో ఆయన బదిలీ జరిగింది. ఇప్పుడు రామకృష్ణ కూడా గట్టి ఆఫీసర్‌గా పేరు తెచ్చుకున్నాడు. రావడంతోటే సమర్ధవంతంగా పనిచేస్తున్నాడు. మొదట బెట్టింగ్ మాఫియాను ఓ కొలిక్కి తెచ్చిన ఆయన ఇక ఎర్రచందనం స్మగ్లింగ్‌పై పడ్డాడు. గత నెల 27వ తేదీన ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ కలువాయి, అనంతసాగరం, రాపూరు మండలాల్లో భారీఎత్తున దాడులు జరిపాయి. అంతర్జాతీయ స్మగ్లర్లయిన సంగటి సుబ్బయ్య, దాడినేని సుబ్బయ్యలతో పాటు మరో 19మంది స్థానిక స్మగ్లర్లను అరెస్ట్ చేశారు. వారి నుండి కోటి రూపాయల విలువచేసే 64ఎర్రచందనం దుంగలను, 11వాహనాలు, 13 సెల్‌ఫోన్‌లు, 2 నాటు తుపాకులను స్వాధీనం చేసుకున్నారు. నిందితులందరి మీద కొత్తగా అమలులోకి వచ్చిన అటవీశాఖ యాక్ట్ క్రింద కేసులు నమోదు చేసి కోర్టులో హాజరు పరుస్తున్నామని ఎస్పీ రామకృష్ణ తెలిపారు.

28వ తేదీ నెల్లూరు పోలీస్‌గ్రౌండ్‌లోని ఉమేష్‌చంద్ర కాన్ఫరెన్స్‌హాల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత నెల 2వ తేదీన ఓఎస్‌డి విఠలేశ్వరరావు ఆధ్వర్యంలో ఎర్రచందనం అక్రమ రవాణాను అరికట్టడానికి టాస్క్‌ఫోర్స్‌ను ఏర్పాటు చేశామన్నారు. దీనిని ఏర్పాటు చేసినప్పటి నుండి ఇప్పటి వరకు 17 ఎర్రచందనం కేసులు నమోదు చేసి 84మందిని అరెస్ట్ చేయడం జరిగిందని, సుమారు 10 టన్నుల ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకుని 27 వాహనాలను సీజ్ చేశామన్నారు. ఈ కేసుల్లో అంతర్జాతీయ స్మగ్లర్లయిన చైనాకు చెందిన ఓయుహుష్, నేపాల్‌కు చెందిన సోనం టోప్‌జ్యాల్, రీతూపాండే, టిబెట్‌కు చెందిన టెంపాల్‌ను అలాగే రాష్ట్ర స్మగ్లర్లయిన చెన్నైకు చెందిన సాధిక్, మన్సూర్, వసీంరాజా, ఫరూక్, రసూల్‌లను కూడా అరెస్ట్ చేశామన్నారు. అటవీ ప్రాంతాల్లో నిరంతరం నిఘా ఉంచి ఎర్రచందనం స్మగ్లర్ల ఆట కట్టిస్తున్నామని ఎస్పీ చెప్పారు. ఈ సమావేశంలో ఓఎస్‌డి విఠలేశ్వరరావు, ఎస్‌బి డిఎస్పీ కోటారెడ్డి, ఎస్‌బి సిఐ మాణిక్యరావులు పాల్గొన్నారు. స్పెషల్ టాస్క్‌ఫోర్స్ సిబ్బందిని ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు.

# బెట్టింగ్ కేసు వైసిపికే పరిమితమా?

***ఒక క్రమపద్ధతిలో సాగుతుందనుకున్న బెట్టింగ్ కేసు పొలిటికల్ ట్రాక్ మీదకు ఎక్కడం తెలిసిందే! బుకీలు, పంటర్లలో అంతకుముందు తెలుగుదేశం, వైకాపాలు వున్నప్పటికీ వాళ్లు రాజకీయంగా అంత పాపులర్ కాదు కాబట్టి ఎవరూ పట్టించు కోలేదు. అయితే బెట్టింగ్ కేసులో వైసిపి ఎమ్మెల్యేలు కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, పి.అనిల్ కుమార్‌యాదవ్‌లను ఒకటికి రెండు సార్లు విచారణకు పిలవడంతో ఈ కేసు హాట్ టాపిక్‌గా మారింది.***




**పోలీసులకు తమ విచారణలో ఉపయోగపడే ప్రశ్నలంటూ చూపుతున్న కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి**

తమ విచారణలో ఎమ్మెల్యేల పేర్లు ఎవరూ చెప్పలేదని ఎస్పీయే స్వయంగా చెప్పడం, ఆయన చెప్పిన తర్వాత కూడా ఈ కేసులో విచారణకు హాజరు కావాలని ఎమ్మెల్యేలకు నోటీసులు పంపడం కలకలం రేపింది. క్రికెట్ బుకీ కృష్ణసింగ్‌తో ఎమ్మెల్యేలకు ఏ విధమైన సంబంధాలున్నాయన్న దానిమీదే పోలీసు విచారణ జరిగింది. బెట్టింగ్ కేసులో ఎమ్మెల్యేల పాత్రపై బలమైన ఆధారాలుంటేనే గాని పోలీసులు ఈ స్థాయిలో నోటీసులు జారీ చేసి విచారణకు పిలవలేరు. మరి ఆధారాల్లేకుండా విచారణకు పిలిచారంటే అది రాజకీయ ఒత్తిడి వల్లేనని వైకాపా నేతల అనుమానం.

బెట్టింగ్ ముఠాలతో జిల్లాలోని పలువురు తెలుగుదేశం నాయకులకు కూడా సంబంధాలున్నాయి. ప్రధానంగా మేయర్ ఎన్నికల్లో గోవాలో నిర్వహించిన క్యాంప్‌కు బుకీ కృష్ణసింగ్ నిధులు సమకూర్చాడా? అని పోలీసులు ఎమ్మెల్యేలను విచారించారు. అసలు ఆ క్యాంప్ పెట్టిందే మేయర్ అజీజ్. ఖర్చంతా ఆయనే చూసుకున్నాడు. అలాంటి సమాచారమేదన్నా కావాలంటే పోలీసులు నేరుగా మేయర్ అజీజ్‌నే పిలిచి అడగొచ్చు కదా అని ఎమ్మెల్యే కోటంరెడ్డి ప్రశ్నిస్తున్నాడు. అలాగే క్రికెట్ బుకీల ఫోన్ కాల్‌డేటా తీయండి, ఏడాదిగా వాళ్లు తరచూ మాట్లాడిన మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, మాజీమంత్రులు, మాజీఎమ్మెల్యేలు, పోలీసు అధికారులతో నేరుగా వారి గన్‌మెన్‌లు, డ్రైవర్ల ద్వారా మాట్లాడిన కాల్ లిస్టు ఆధారంగా నోటీసులు జారీ చేసి విచారణకు పిలవండి, అలాగే బెట్టింగ్‌లు ఆడుతున్న సుమారు 400మంది చిన్న సన్న వారిని అరెస్ట్ చేసి కోర్టుకు పెట్టారు. మంచిదే, అలాగే బెట్టింగ్‌లకు పాల్పడుతున్న వారిలో మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, మాజీమంత్రులు, మాజీ ఎమ్మెల్యేలు కూడా వున్నారు. ఆ దిశగా విచారణ సాగిస్తున్నారా లేదా? అని ఎమ్మెల్యే కోటంరెడ్డి అడుగుతున్న ప్రశ్నకు పోలీసుల నుండి ఎలాంటి సమాధానం వస్తుందో చూడాలి!





# రోడ్ల పుణ్యాన పెరుగుతున్న పేషంట్లు

నెల్లూరులో భూగర్భడ్రైనేజీ పనుల కోసం తవ్వేసిన సిమెంట్ రోడ్ల పుణ్యాన కీళ్లు, ఎముకలు డాక్టర్లకు పేషంట్లు పెరిగినట్లు తెలుస్తోంది. నగరంలో ప్రతి సిమెంట్‌రోడ్డును మధ్యలో కట్ చేసి భూగర్భ డ్రైనేజీ పైపు లైన్‌లు వేసారు. ఇటీవల తరచూ వర్షాలు పడుతున్నాయి. రోడ్డు మీద నీళ్ళు నిండిపోవడంతో మధ్యలో తవ్వింది ఎక్కడో తెలియక నడుచుకుంటూ వెళ్లే వాళ్లు పట్టు తప్పి పడిపోతున్నారు. కాళ్లు, చేతులు విరుగుతున్నాయి. ఈ విధంగా తవ్వేసిన నెల్లూరు రోడ్ల మీద జారిపడే కొందరు ఆస్పుత్రుల పాలయ్యారు. కొందరికైతే కాళ్లకు ఆపరేషన్‌లే చేస్తున్నారని తెలిసింది. రేపు సెప్టెంబర్, అక్టోబర్ నెలల్లో భారీ వానలు కురిస్తే పరిస్థితి ఇంకెంత దారుణంగా ఉంటుందో?

## నెల్లూరు కబుర్లు

### గణనాథుని ఆశీస్సులతో...

# ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలి

**- మంత్రి సోమిరెడ్డి**



మహాగణపతి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో వుండాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ఆకాంక్షించారు. ఆదివారం ఆయన సంతపేటలో ఏర్పాటు చేసిన గణేష్ విగ్రహానికి విశేషపూజలు నిర్వహించారు. అనంతరం ట్రంకురోడ్డులోని శివాజీ సెంటర్‌లో ఏర్పాటు చేసిన గణేష్ విగ్రహానికి ప్రత్యేకపూజలు నిర్వహించి మాట్లాడుతూ గణేష్ కమిటి సభ్యులు భక్తిశ్రద్ధలతో గత కొన్ని సంవత్సరాలుగా గణనాథుని అత్యంత వైభవంగా అలంకరించి పూజలు నిర్వహిస్తున్నారని, వారందరికీ మంచి జరగాలని, రాష్ట్రం సుభిక్షంగా వుండాలని దేవదేవుని ప్రార్థించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నెల్లూరు నగర కార్పొరేటర్లు, విగ్రహ కమిటి సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# ఉర్రూతలూగించిన ఓనం సంబరాలు



మళయాలీస్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నెల్లూరుజిల్లాలోని వివిధ ప్రాంతాలకు చెందిన మళయాళీలు ఆదివారం నెల్లూరు టౌన్‌హాలులో ఓనం సంబరాలను కోలాహలంగా, ఆనందోత్సాహాలతో జరుపుకున్నారు. అసురరాజు మహాబలి చక్రవర్తి పునరాగమనాన్ని పురస్కరించుకుని మలయాళీలు ఓనం పండుగను సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. మహా బలిచక్రవర్తి రాక్షసరాజు అయినప్పటికీ ఆయన కేరళను పరిపాలించిన సమయంలో దేశంలో ప్రజలు సుఖసంతోషాలు, సంబరాలతో జీవించారన్నారు. మహావిష్ణువు వామన రూపంలో మహాబలిచక్రవర్తిని అంతమొందించాక, విష్ణువును మహాబలిచక్రవర్తి ఏడాదిలో ఒకరోజు తన ప్రజలను చూసేందుకు అవకాశం కల్పించాలని కోరుకున్నారు. ఆయన రాకతో గత ఆనందోత్సాహాల రోజులను మననం చేసుకుంటూ మహాబలిచక్రవర్తిని స్వాగతిస్తూ... 'ఓనం' పండుగను కేరళీయులు జరుపుకోవడం సంప్రదాయంగా వస్తుందని నిర్వాహకులు వివరించారు. ఈ సందర్భంగా కులమతాలకు అతీతంగా హిందూ సంప్రదాయాన్ని ప్రతిబింబిస్తూ 'తిరువాకర' ఇస్లాం సంప్రదాయాన్ని పాటిస్తూ 'ఒప్పన' క్రైస్తవ ఆచార వ్యవహారాలకు గుర్తుగా 'మార్గంగళి' నృత్యాలను ప్రదర్శించారు. కాగా, ఈ కార్యక్రమాలకు ముఖ్యఅతిథిగా ప్రముఖ సినీ హీరో సంపూర్ణేష్‌బాబు పాల్గొన్నారు. ఈ సందర్భంగా భారతీయ సంస్కృతి ప్రతిబింబించేలా నృత్యప్రదర్శనలు నిర్వహించారు.

# టీడీపీ విజయోత్సవాలు





నంద్యాల అసెంబ్లీ ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ ఘనవిజయం సాధించడంతో నెల్లూరులోని ఆ పార్టీ నాయకులు, కార్యకర్తల ఆనందానికి అవధులు లేకుండాపోయాయి. 28వ తేదీ ఫలితాలు వెలువడగానే నుడా ఛైర్మెన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి నగరంలో ఎన్టీఆర్ విగ్రహం వరకు విజయోత్సవ ర్యాలీని నిర్వహించారు. భారీఎత్తున బాణాసంచా కాల్చి స్వీట్లు పంచుకున్నారు. మేయర్ అబ్దుల్ అజీజ్, మాజీఎమ్మెల్యే ముంగమూరు శ్రీధరకృష్ణారెడ్డిలతో పాటు టీడీపీ కార్పొరేటర్లు, నాయకులు కూడా ఈ విజయోత్సవ వేడుకల్లో పాల్గొన్నారు. అలాగే మినీబైపాస్‌లోని పార్టీ జిల్లా కార్యాలయంలో పార్టీ జిల్లా అధికార ప్రతినిధి డాక్టర్ జడ్.శివ ప్రసాద్ ఆధ్వర్యంలో విజయోత్సవ వేడుకలు జరిగాయి. మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి కుమారుడు, యువ నాయకుడు సోమిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి ఈ వేడుకలలో పాల్గొని మిఠాయిలు పంచిపెట్టారు. పార్టీ కార్యాలయం వద్ద భారీఎత్తున బాణాసంచా కాల్చారు. పెద్దసంఖ్యలో నాయకులు, కార్యకర్తలు ఈ వేడుకల్లో పాల్గొన్నారు.

# తరిగిన ఐల్యాండ్‌లు




నెల్లూరు నగరంలో విగ్రహాలు, వాటి ఐల్యాండ్‌లకు బ్రాండ్ అంబాసిడర్ మాజీ ఎమ్మెల్యే ఆనం వివేకానందరెడ్డి. ఆయన ఎమ్మెల్యేగా వున్నప్పుడే నగరంలో ఎన్నో ఐల్యాండ్‌లను అద్భుతంగా నిర్మించారు. వాటి కోసం లక్షలాది రూపాయలు తగలేసారు. రామలింగాపురం జంక్షన్‌లో ఆనం వెంకటరెడ్డి విగ్రహం, కరెంట్ ఆఫీస్ సెంటర్‌లో వై.యస్. విగ్రహం, ఆర్టీసీ వద్ద ఇందిరమ్మ విగ్రహం, ఏ.సి సెంటర్‌లో ఏ.సి.సుబ్బారెడ్డి విగ్రహం, మద్రాసు బస్టాండ్ వద్ద నెహ్రూ విగ్రహం, విఆర్‌సి సెంటర్‌లో అంబేద్కర్ విగ్రహం, విజయమహల్‌గేటు సెంటర్‌లో పూలే విగ్రహం ఐల్యాండ్‌లు, వీటికి తోడు పొదలకూరురోడ్డులో కొండాయపాలెం వెళ్లే రోడ్డు జంక్షన్‌లో అతిపెద్ద ఐల్యాండ్... ఇవన్నీ వివేకా ఆలోచనలకు ప్రతిరూపాలే! వీటిలో కొన్ని ఐల్యాండ్‌లైతే ట్రాఫిక్‌కు పెద్ద అవరోధంగా మారాయి. ఆయా ఐల్యాండ్‌ల వద్ద ప్రతిరోజూ ట్రాఫిక్ సమస్యలు ఉత్పన్నమయ్యేవి.

గత ఎస్పీ విశాల్‌గున్నీ ట్రాఫిక్ క్రమబద్ధీకరణ కోసం ఈ ఐల్యాండ్‌ల కుదింపుపై దృష్టిపెట్టారు. విశాల్‌గున్నీ హయాంలో గాని, ఆ తర్వాత గాని కరెంట్ ఆఫీస్ సెంటర్, ఆర్టీసీ, నెహ్రూ బొమ్మ, గాంధీబొమ్మ ఐల్యాండ్‌లను కుదించారు. ఇప్పుడు కెవిఆర్ పెట్రోల్‌బంకు సెంటర్‌లోని మాగుంట సుబ్బరామరెడ్డి విగ్రహం ఐల్యాండ్‌ను తగ్గిస్తున్నారు. ఇక ట్రాఫిక్‌కు పెద్ద ఇబ్బందిగా వున్న అంబేద్కర్ విగ్రహం, ఆనం వెంకురెడ్డి విగ్రహం ఐల్యాండ్‌లతో పాటు పొదలకూరురోడ్డులో సగానికి పైగా రోడ్డును ఆక్రమించి నిర్మించిన ఐల్యాండ్‌ను కూడా తగ్గిస్తున్నారు.

# నరాల వ్యాధులపై అప్రమత్తత అవసరం



నరాల వ్యాధులపై అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందని ప్రముఖ నరాల వైద్యనిపుణురాలు డాక్టర్ బిందుమీనన్ అన్నారు. ఆదివారం డాక్టర్ బిందుమీనన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నెల్లూరు రూరల్ నవలాకుల తోటలో ఉచిత వైద్యశిబిరం జరిగింది. ఈ సందర్భంగా డాక్టర్ బిందుమీనన్ మాట్లాడుతూ మానవ శరీరంలో మెదడు కీలకమని, ఏ పని చేయాలన్నా అది చురుగ్గా పనిచేసినప్పుడే నరాలు ఆరోగ్యంగా ఉన్నట్లని తెలిపారు. మెదడులోని నరాలు సక్రమంగా పనిచేయకుంటే పక్షవాతానికి గురయ్యే ప్రమాదం ఉందన్నారు. మూర్ఛ(ఫిట్స్) కూడా నరాలు సక్రమంగా పని చేయకుంటే వస్తుందన్నారు. పక్షవాతం, మూర్ఛ వ్యాధులకు గురికాకుండా తగిన జాగ్రత్తలు పాటించాలని కోరారు. పొగాకు నమలడం, పొగ తాగడం, మద్యం సేవించడం, ఒత్తిడి, కిడ్నీ వ్యాధుల కారణంగా నరాల వ్యాధులు వచ్చే అవకాశం ఎక్కువగా వుంటాయన్నారు. పక్షవాతం, మూర్ఛవ్యాధులకు సంబంధించిన లక్షణాలు కనిపిస్తే వెంటనే సంబంధిత వైద్యుడిని సంప్రదించి తగిన వైద్య సేవలు పొందాలన్నారు. అనంతరం రోగులను పరీక్షించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు.

# మురళీ ఆధ్వర్యంలో ఆనం విజయ జన్మదినోత్సవం



వైసిపి నాయకులు ఆనం విజయ కుమార్‌రెడ్డి 62వ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని ఆగస్టు 25వ తేదీన నెల్లూరులోని 31, 32 డివిజన్‌లలో పేదలకు స్వీట్లు, పండ్లు పంపిణీ చేశారు. వైసిపి జిల్లా రైతు విభాగం కార్యదర్శి కొరపాటి మురళీనాయుడు ఆధ్వర్యంలో ఆనం విజయ పుట్టినరోజు వేడుకలు నిర్వహించారు.

### బస్సులోళ్లకు

# పండుగొచ్చింది!

25వ తేదీ వినాయకచవితి, 26వ తేదీ శనివారం, ఇక 27వ తేదీ ఎలాగూ ఆదివారం... వరుసగా మూడురోజుల సెలవులు. బస్సులలో టికెట్ల సంగతి చెప్పాలా? రైళ్లలో ఎలాగూ టిక్కెట్లు దొరకవు. ఇక బస్సులే దిక్కు! వినాయకచవితి పండుగ కోసం బెంగుళూరు, హైదరాబాద్, చెన్నైలలో వున్న నెల్లూరీయులు తమ సొంతూర్లకు రావడానికి ఎన్నో తంటాలు పడ్డారు. 24వ తేదీ రాత్రి హైదరాబాద్, బెంగళూరులలో నెల్లూరు వైపు వచ్చే బస్సుల్లో టిక్కెట్లు దొరకడమే గగనమైపోయింది. వచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటూ టిక్కెట్ల రేట్లను రెండింతలు, మూడింతలు చేసారు. సెలవులు ముగించుకుని తిరిగి వెళ్లే ఆదివారం రాత్రి కూడా ప్రైవేట్ బస్సుల దోపిడీ ఇలాగే సాగింది. ఇక ఆర్టీసీ కూడా 50 శాతం అదనపు ఛార్జీలతో బెంగుళూరు–హైదరాబాద్‌లకు ప్రత్యేక బస్సులను నడిపింది. ఇలా వరుసగా సెలవులు వచ్చినప్పుడు బయట ప్రాంతాల్లో వున్న వాళ్లు నెల్లూరొచ్చి పోవాలంటే చేతి చిలుం బాగానే వదులుతోంది.

వరుస సెలవులొచ్చినప్పుడు బస్సుల్లో టిక్కెట్ల రేట్ల కంటే కూడా నెల ముందుగా బుక్ చేసుకుంటే విమానం టిక్కెట్లే తక్కువుగా ఉంటున్నాయి.

## క్రీడలే లేనప్పుడు...
# దినోత్సవాలెందుకు?

క్రీడలు... ఒకప్పుడు చదువుల్లో ఇదొక భాగం. సైన్స్ క్లాస్, సోషల్ క్లాస్, తెలుగు క్లాస్ వున్నట్లుగానే ఆటలకు కూడా ఒక పిరియడ్ వుండేది. టైం టేబుల్ చివర్లో పిఇటి పిరియడ్‌ను విద్యార్థుల వ్యాయామానికి, వారి మధ్య ఆటల పోటీలు నిర్వహించడానికి ఉపయోగించేవాళ్ళు. విద్యార్థులు కూడా పాఠశాల టైం దాటినా మైదానంలోనే వుండి పొద్దుపోయే వరకు ఆటల్లో నిమగ్నమయ్యే వాళ్ళు. ఒకప్పుడు విద్యార్థులు చదువులకు ఎంతటి ప్రాధాన్యతనిచ్చేవాళ్ళో ఆటలకు కూడా అంతే ప్రాధాన్యతనిచ్చేవాళ్ళు. చాలామంది స్పోర్ట్స్ కోటాలోనే సీట్లు, ఉద్యోగాలు సాధించేవాళ్ళు. ప్రతి ప్రభుత్వ పాఠశాలకు కూడా విశాలమైన క్రీడా మైదానాలుండడంతో విద్యార్థులు సరదాగా ఆటలాడుకునేవాళ్ళు.



కాని, ఈ కాలంలో విద్యార్థులకు స్పోర్ట్స్ అంటే తెలిసేది కంప్యూటర్ గేమ్స్, సెల్‌ఫోన్ గేమ్స్! వాటినే ఆటలనుకునే స్థాయిలో విద్యార్థులున్నారు. దానికి కారణం తల్లొరింది మొదలు విద్యార్థుల బ్రతుకంతా చదువులు, మార్కులు, ర్యాంకుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తుండడమే.

ఇప్పటి చదువులు ఎంత నిక్రుష్టంగా వున్నాయో చూస్తున్నాం. 70శాతం చదువులు ప్రైవేట్ కార్పొరేట్ విద్యాసంస్థల్లోనే నడుస్తున్నాయి. ప్రభుత్వ జిల్లా పరిషత్, మున్సిపల్ స్కూళ్లలో అన్ని వసతులు, విశాలమైన మైదానాలు, పిఇటి మాష్టార్లు వున్నా... ఇక్కడ విద్యార్థులకు కరువు. ఇప్పుడు సర్కార్ బళ్లలో చదివే వాళ్లు కూడా మార్కుల్లో ఎక్కడ వెనుకబడుతామోనని ఆటలపై పెద్దగా ఆసక్తి చూపడం లేదు. అయ్యవార్లు కూడా పదో తరగతిలో ఉత్తీర్ణతా శాతం తగ్గితే అధికారులు తమ మీద విరుచుకు పడతారోనని భయంతో ఆడించడం కంటే చదివించడానికే ఎక్కువ ప్రాధాన్యతనిస్తున్నారు. కాబట్టి ప్రభుత్వ పాఠశాలల్లో కూడా క్రీడా ప్రోత్సాహం అంతంతమాత్రంగానే వుంది.

ఇక ప్రైవేట్, కార్పొరేట్ విద్యా సంస్థల సంగతి చెప్పాలా? ప్రైవేట్ విద్యాసంస్థల్లో విద్యార్థుల ఆటలపాటల సంగతి దేముడెరుగు... వారి బ్రతుకులతోనే విద్యాసంస్థలు ఫుట్‌బాల్ ఆడుకుంటున్నాయి. ప్రైవేట్ బళ్లల్లో విద్యార్థి బ్రతుకు ఎలా మారిందో ప్రత్యేకంగా చెప్పనక్కరలేదు. ఉదయం 8గంటలకు చదువు అనే రుబ్బురోలులో వేసారంటే రాత్రి 8గంటలయితే గాని ఆ రోలు నుండి బయటకు తీయరు. రాత్రి స్కూల్ వదిలాక బయట కొస్తున్న పిల్లలను చూస్తుంటే యావజ్జీవ శిక్ష ముగించుకుని జైలు నుండి బయటకొస్తున్న ఖైదీల మాదిరే కనిపిస్తుంటారు. ఇలాంటి చదువుల రోబోలకు ఇక ఆటలు కూడానా? అసలు ఆడించడానికి ప్రైవేట్ స్కూళ్లలో క్రీడామైదానాలు ఎక్కడ వున్నాయి? 50 అంకణాలు, వంద అంకణాల స్థలాల్లో కూడా ఐదంతస్థుల కార్పొరేట్ బిల్డింగ్‌లు... వెలుతురు గాలి దూరని తరగతి గదుల్లో చదువులు... ఒక వాలీబాల్ కోర్టునో, బ్యాడ్మింటన్ కోర్టునో ఏర్పాటు చేయాలంటేనే కనీసం 30అంకణాల స్థలం కావాలి... అంత స్థలమే వుంటే మనవాళ్ళు ఇంకో స్కూల్ బిల్డింగ్ కడతారు. చదువులు పూర్తిగా యాంత్రికమై, విద్యార్థులే రోబోలుగా మారిన ఈరోజుల్లో వారి జీవితాలలో ఇక క్రీడా వినోదాలన్నవి కాగితాలకే పరిమితం. కేవలం ఆగస్టు 29వతేదీ నాడు మొక్కుబడిగా జాతీయ క్రీడా దినోత్సవం జరుపుకుంటున్నాం.

## విద్యార్థులను ప్రతిభావంతులుగా తీర్చిదిద్దండి
### - రెసిడెన్షియల్ కళాశాలల ప్రిన్సిపాల్స్‌తో కలెక్టర్



విద్యార్థులను మరింత ప్రతిభావంతులుగా తీర్చి దిద్దాలని, ఎంసెట్, పోటీ పరీక్షల్లో ధీటుగా రాణించే విధంగా చూడాలని, విద్యార్థుల నైపుణ్యానికి మెరుగు పెట్టాలని జిల్లా కలెక్టర్ ఆర్.ముత్యాలరాజు అన్నారు. గతనెల 26న కలెక్టర్ క్యాంప్ కార్యాలయంలో నిర్వహించిన ప్రభుత్వ రెసిడెన్షియల్ కళాశాలల ప్రిన్సిపాల్స్ సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ, సాంఘిక సంక్షేమశాఖ పరిధిలో 10 రెసిడెన్షియల్ జూనియర్ కళాశాలలు, గిరిజన సంక్షేమశాఖ పరిధిలో 2 రెసిడెన్షియల్ కళాశాలలు, ఒక ఏ.పి రెసిడెన్షియల్ కళాశాల మొత్తంగా ఈ కళాశాలల్లోని విద్యార్థులకు ఎంసెట్ ఓరియంటెడ్‌గా ఉండే విధంగా వారం వారం పరీక్షలు పటిష్టంగా నిర్వహించాలన్నారు. ప్రతి కళాశాలలో విద్యార్థులు చూపుతున్న ప్రతిభను బట్టి వారిని ఏ,బి,సి గ్రూపులుగా విభజించి, వారికి ఎంసెట్ ట్యూటర్లు, లెక్చరర్లు విద్యాబోధన చేసేవిధంగా చూడాలన్నారు. వారపు పరీక్షలు నిర్వహించిన తరువాత స్కానింగ్ ద్వారా పేపర్ వ్యాల్యుయేషన్ చేసి రెండవరోజు వారి మార్కుల జాబితాను పంపించాలన్నారు. ఈ సమావేశంలో సాంఘిక సంక్షేమ శాఖ ఉపసంచాలకులు మధుసూదన్ రావు, ప్రభుత్వ రెసిడెన్షియల్ కళాశాల జిల్లా కో-ఆర్డినేటర్ హేమలత, ఐటిడిఏ పి.ఓ కమలకుమారి, కో-ఆర్డినేటర్ బాలరామిరెడ్డి, కన్సల్టెంట్ డివి రావు, రెసిడెన్షియల్ కళాశాలల ప్రిన్సిపాల్స్ పాల్గొన్నారు.



## అపోలోలో విజయవంతంగా...
# కిడ్నీ మార్పిడి

నెల్లూరులోని అపోలో స్పెషాలిటీ ఆసుపత్రిలో కిడ్నీ ఆపరేషన్‌ను విజయవంతంగా నిర్వహించి బిటెక్ చదువుతున్న నాగార్జున అనే 21ఏళ్ల కుర్రాడికి ప్రాణం పోసారు వైద్యులు. ఈ ఆపరేషన్‌కు సంబంధించిన వివరాలను 28వ తేదీ ఆసుపత్రిలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆసుపత్రి యూనిట్ హెడ్ నవీన్ వివరించారు.

కావలి మండలం రుద్రకోటకు చెందిన నాగార్జున(21) బిటెక్ చదువుతున్నాడు. అతని రెండు కిడ్నీలు చెడిపోయి డయాలసిస్ కూడా చేయలేని పరిస్థితిలో వున్నాడు. ఎన్నో ఆసుపత్రులు తిరిగినా నయం కాని పరిస్థితుల్లో అపోలో ఆసుపత్రికొచ్చి నెఫ్రాలజీ విభాగం వైద్యులు డాక్టర్ ఎం.వి.సురేష్‌కుమార్‌రెడ్డిని సంప్రదించారు. ఆయన నాగార్జునకు వైద్యపరీక్షలు నిర్వహించి కిడ్నీ మార్పిడి చేయాలని అతని కుటుంబసభ్యులకు సూచించారు. నాగార్జునకు అమ్మమ్మ అయిన రమణమ్మ కిడ్నీ ఇవ్వడానికి ముందుకు రావడంతో, ఇద్దరికీ వైద్యపరీక్షలు నిర్వహించి ఆగస్టు 19వ తేదీన నాగార్జునకు కిడ్నీ మార్పిడి ఆపరేషన్‌ను విజయవంతంగా పూర్తి చేశారు. ఆపరేషన్ తర్వాత నాగార్జున, రమణమ్మలిద్దరూ ఆరోగ్యంగానే వున్నారు. మెట్రోపాలిటన్ నగరాలలో కిడ్నీ మార్పిడి భారీఖర్చుతో కూడుకున్న పని. నెల్లూరు అపోలో ఆసుపత్రిలో అతి తక్కువ ఖర్చుతో అత్యాధునిక వైద్యపరికరాలతో సులభతరంగా ఆపరేషన్ నిర్వహిస్తున్నామని ఈ సందర్భంగా నవీన్ తెలిపారు. పేషంట్ నాగార్జున తనకు అపోలో యూనిట్‌హెడ్ నవీన్, వైద్యులు సురేష్‌కుమార్‌రెడ్డి, ఇతర వైద్య సిబ్బంది ప్రాణదానం చేసారని, వారు నాకు దేవుళ్లతో సమానమంటూ కృతజ్ఞతలు తెలిపాడు.

## అటవీశాఖాధికారిగా రామ్మోహన్‌రావు

నెల్లూరుజిల్లా అటవీశాఖాధికారి(టెరిటోరియల్)గా రామ్మోహన్‌రావు సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా జిల్లా అటవీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎర్రచందనం స్మగ్లర్లపై కఠినచర్యలు తీసుకుంటామని, లక్ష్యం మేరకు మొక్కలు నాటే కార్యక్రమంతో పాటుగా నర్సరీలలో ప్రజలకు అందుబాటులో ఎప్పుడూ మొక్కలను ఉంచుతామన్నారు.

## • లైసెన్స్‌దారులకు లైన్ క్లియర్
# మినీబైపాస్‌లో మళ్ళీ మద్యం జాతర!



జాతీయ, రాష్ట్ర రహదారులకు 500 మీటర్ల దూరంలో మద్యం షాపులు, బార్లు ఉండాలని సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పుతో మద్యం వ్యాపారులు నిన్నటి దాకా దిక్కు తోచని స్థితిలో వుండి పోయారు. సుప్రీం కోర్టేమో హైవేల పక్కన పెట్టుకోవద్దని. 500 మీటర్ల లోపలకు పోయి పెట్టుకుంటే అక్కడ కాపురాలుంటున్న జనాలు తన్ని తరిమేస్తిరి. అటు సుప్రీంకోర్టు దెబ్బకు ఇటు జనం దెబ్బకు చాలామంది జూలైలోనే 2017–19 సంవత్సరాలకు లైసెన్సులు తెచ్చుకుని కూడా మద్యం దుకాణాలను, బార్లను తెరవలేకపోయారు. మద్యం వ్యాపారుల బాధను అర్థం చేసుకున్న రాష్ట్ర ప్రభుత్వం నగరాలు, పట్టణాల మధ్య వెళ్లే జాతీయ, రాష్ట్ర రహదారులను జిల్లా ప్రధాన రహదారులుగా పేరు మార్చే ప్రయత్నం చేసింది. అయితే ఈలోపే కొందరు చెన్నైకి చెందిన మద్యం వ్యాపారులు సుప్రీం కోర్టుకు వెళ్లి మన మద్యం వ్యాపారుల నెత్తిన మద్యం పోసారు. నగరాలు, పట్టణాలలో వుండే రహదారులలోకి లారీలు రావు గనుక అక్కడి రోడ్ల పక్కన మద్యంషాపులకు అనుమతించాలని మద్యం వ్యాపారులు ఆ పిటిషన్‌లో కోరారు. సుప్రీం కోర్టు అందుకు అంగీకరించడంతో నగరాలు, పట్టణాలలో రాష్ట్ర రహదారుల వెంట వైన్‌షాపులు పెట్టాలనుకున్న వారికి ఊపిరొచ్చినట్లయ్యింది. నెల్లూరు నగరంలోనే అయ్యప్పగుడి నుండి కోవూరు ఆర్టీసీ మెకానిక్ ప్రాంగణం వరకు మినీబైపాస్ రోడ్డుకు ఇరువైపులా పాతిక దాకా బార్లు, వైన్‌షాపులు ఉండేవి. ఇక్కడ లైసెన్సులు పొందినవాళ్లు సుప్రీంకోర్టు ఆదేశాలతో తమ షాపులను ఎక్కడ పెట్టుకోవాలో తెలియక కాళ్లు కాలిన పిల్లుల్లా తిరుగుతున్నారు. కొందరైతే ఇంకా షాపునే పెట్టలేదు. ఇప్పుడు సుప్రీం కోర్టు ఇచ్చిన తాజా ఆదేశాలతో మినీబైపాస్‌కు మళ్ళీ మద్యం కళ వచ్చినట్లే!


అధునాతన గృహోపకరణాలకు చిరునామా
అమ్మ ఫర్నిచర్ మాల్
మినీబైపాస్‌రోడ్, నెల్లూరు.
Latest & New Models
ప్రతి కొనుగోలు పై డిస్కౌంట్ కలదు



ప్రఖ్యాత సీనియర్ కంటి వైద్య నిపుణునికి
హార్థిక స్వాగతం!
నెల్లూరు ప్రజలకు సుపరిచితులైన
డా॥ ఎస్.సి.సుబ్రహ్మణ్యం గారు
తేది. 1.9.2017 నుండి మన
మాడరన్ 'ఐ' హాస్పిటల్
& రీసెర్చ్ సెంటర్ నందు
తమ పూర్తిస్థాయి వైద్యసేవలను
అందించుటకు విచ్చేస్తున్న శుభసందర్భమున
డాక్టరు గారికి సుస్వాగత శుభాకాంక్షలతో...



స్టాఫ్ & మేనేజ్‌మెంట్
మాడరన్ 'ఐ' హాస్పిటల్ & రీసెర్చ్ సెంటర్
పొగతోట, నెల్లూరు. ఫోన్: 0861 - 2324868, 2306015



# జైజై!.. గణేశా!..

- విఘ్నేశ్వరుని నామస్మరణలతో మార్మోగిన సింహపురి
- కోలాహలంగా వినాయకచవితి వేడుకలు



'జై జై గణేశా'!..అంటూ విఘ్నేశ్వరుని నామస్మరణలతో సింహపురిసీమ మార్మోగిపోయింది. వాడవాడలా గణపయ్యకు పూజలు వెల్లువెత్తాయి. ఎక్కడ చూసినా వినాయకచవితి సందడే. నగరంలోని శివాజీ సెంటర్‌లో గణేష్ ఉత్సవసమితి ఆధ్వర్యంలో గణేష్ విగ్రహాన్ని ప్రతిష్టించారు. తొలిరోజు జరిగిన పూజల్లో ప్రముఖదాత, పారిశ్రామికవేత్త వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి పాల్గొని స్వామివారిని సేవించుకున్నారు. బిజెపి రాష్ట్ర అధికారప్రతినిధి కర్నాటి ఆంజనేయరెడ్డి, బిజెపి జిల్లా అధ్యక్షుడు పి.సురేంద్రరెడ్డి, ఉత్సవ సమితి కార్యనిర్వాహక అధ్యక్షుడు పిట్టి సత్యనాగేశ్వరరావు, నిర్వాహకులు కెవి సుబ్రహ్మణ్యం, బి.విజయకుమార్ రెడ్డి, న్యాయవాది రంగరాజన్, కె.మధు, బిజెపి కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు తేలపల్లి రాఘవయ్య తదితరులు పాల్గొని గణేశునికి ఘనంగా పూజలు నిర్వహించారు. అదేవిధంగా, కాపువీధి కూడలిలో కాపువీధి మిత్రమండలి ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లో మాజీమంత్రి ఆనం రామనారాయణరెడ్డి, కార్పొరేటర్ రంగమయూర్‌రెడ్డి, నాయకులు ఏసి సుబ్బారెడ్డి, ఆనం శుభకర్‌రెడ్డి కుటుంబసభ్యులు పాల్గొని పూజలు చేశారు.

### కనువిందు చేసిన వినాయకులు:

వినాయకచవితిని పురస్కరించుకుని నగరంలోని అనేక వీధుల్లో, కూడలి ప్రాంతాల్లో ఏర్పాటుచేసిన వినాయక విగ్రహాలు భక్తులను బాగా ఆకట్టుకున్నాయి. చిన్నబజార్ రాణాప్రతాప్‌సెంటర్‌లో స్వామివారు పార్వతీపరమేశ్వర సమేతంగా కొలువుదీరారు. పెద్ద బజార్ కూడలిలో మిత్రమండలి ఆధ్వర్యంలో, పెద్ద బజార్ యువసేన ఆధ్వర్యంలో, బారకాసు సెంటర్‌లో బారకాసు మిత్రమండలి వారు, చిన్నబజార్ రామ మందిరం వీధిలో మరాఠా మిత్రమండలివారు, పణతులవారివీధిలో భార్గవ్ మిత్రమండలి ఆధ్వర్యంలో, ఆచారివీధిలో పెద్దపోస్టాఫీస్ మిత్రమండలి ఆధ్వర్యంలో వినాయకచవితి వేడుకలు ఘనంగా జరిగాయి. హోటల్ శివప్రియ సెంటర్‌లో 16 అడుగుల గణేశుడు కొలువుదీరగా స్వామివారిని దర్శించుకునేందుకు భక్తులు బారులుతీరారు. ఏసినగర్‌లో ఏసినగర్ మిత్రమండలి ఆధ్వర్యంలో, శెట్టిగుంటరోడ్డు లక్ష్మీపురంలో కిన్నెరప్రసాద్ మిత్రమండలి ఆధ్వర్యంలో, బాలాజీనగర్ రైస్‌మిల్లు సెంటర్‌లో బాలాజీనగర్ మిత్రమండలి ఆధ్వర్యంలో, బాలాజీనగర్ ఏటిఎం సెంటర్‌లో ఫ్రెండ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో, భగత్ సింగ్ సెంటర్‌లో సింహపురి గణేశ్ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో, కోటమిట్ట సెంటర్‌లో కృష్ణదేవరాయ మిత్రమండలి ఆధ్వర్యంలో, మాగుంట లే అవుట్ సెలబ్రేషన్స్ సెంటర్ వద్ద మట్టి వినాయకుని విగ్రహం విశేషంగా ఆకర్షించింది... ఇలా అనేక ప్రాంతాల్లో ఆయా ప్రాంతాల్లోని యువకుల ఆధ్వర్యంలో ఘనంగా వినాయకునికి ఉత్సవాలు, పూజలు జరిగాయి.


కాగా, నగరంలోని చిన్నబజార్, పణతులవారి వీధి, ఆచారి వీధి, కూరగాయలమార్కెట్, శ్రీనివాస అగ్రహారం తదితర ప్రాంతాల్లో ఏర్పాటుచేసిన గణనాధుని ఉత్సవాల్లో నగర ఎమ్మెల్యే అనిల్‌కుమార్ యాదవ్ పాల్గొని స్వామివారికి విశేషపూజలు నిర్వహించారు. రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి వేదాయపాళెం సెంటర్‌లో నెమలివాహనంపై కొలువైన గణపతికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో నగర మేయర్ అబ్దుల్ అజీజ్, జిల్లా గ్రంథాలయసంస్థ ఛైర్మెన్ కిలారి వెంకటస్వామి నాయుడు, కార్పొరేషన్ కమిషనర్ ఢిల్లీరావు పాల్గొని వినాయకునికి పూజలు చేశారు.

### ఆకట్టుకున్న మృణ్మయగణపతి:

విఆర్‌సి సెంటర్‌లో ఏర్పాటుచేసిన 15 అడుగుల మట్టిగణపతి విగ్రహం భక్తులను బాగా ఆకట్టుకుంది. విపిఆర్ ఫౌండేషన్, నేస్తం ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ప్రముఖ సైకతశిల్పి హరికృష్ణ ఈ మృణ్మయ గణపతిని అత్యద్భుతంగా తీర్చిదిద్దారు.




కాగా, నగరంలోని వేదాయపాళెం సెంటర్‌లో కొలువైవున్న శ్రీమహా గణపతికి 518కేజీల లడ్డూ ప్రసాదాన్ని నైవేద్యంగా సమర్పించడం ఎంతో విశేషం.









## గూడూరు డివిజన్ వార్తలు

# విద్యార్థులకు రోటరీ స్కాలర్‌షిప్‌లు




గూడూరు పట్టణంలోని రోటరీ భవన్‌లో దొడ్ల రుక్మిణమ్మ రోటరీ స్కాలర్‌షిప్‌ను ఇటీవల పలువురు కళాశాల విద్యార్థులకు అందించారు. ఈ సందర్భంగా రోటరీ క్లబ్ ప్రతినిధులు బాలకృష్ణంరాజు మాట్లాడుతూ విద్యార్థులు బాగా చదివి ఉన్నత శిఖరాలు చేరుకోవాలని అన్నారు. విద్యార్థుల చదువుల నిమిత్తం రోటరీక్లబ్ ద్వారా ఫండ్ ఏర్పాటు చేశామన్నారు. ఇందులో భాగంగానే బాగా చదివే విద్యార్థులకు స్కాలర్‌షిప్ ఇచ్చి ప్రోత్సహిస్తున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రోటరీక్లబ్ ప్రతినిధులు కృష్ణయ్య, జానకిరామిరెడ్డి, హరిప్రసాద్, కె.మునిగిరీష్, అశోక్‌చక్రవర్తి, నాగేంద్రప్రసాద్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



గూడూరులోని వనజాకృష్ణ కళ్యాణ మండపంలో ఇటీవల సౌత్‌సెంట్రల్ రైల్వే బోర్డు మెంబర్ సురేష్‌యాదవ్‌ను సన్మానిస్తున్న శ్రీకృష్ణ సేవాసమితి వ్యవస్థాపకుడు మయూరి శ్యాంయాదవ్.

# తెదేపావైపే ప్రజల మొగ్గు



డప్పు కొడుతున్న ఎమ్మెల్యే పాశం సునీల్, చేవూరు విజయమోహన్‌రెడ్డి తదితరులు

రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలను చూసే నంద్యాల ప్రజలు తెలుగుదేశం పార్టీ వైపు మొగ్గు చూపారని గూడూరు ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ అన్నారు. నంద్యాల ఉపఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ భారీమెజార్టీతో గెలుపొందడంపై సోమవారం నాయకులంతా బాణాసంచా కాలుస్తూ మిఠాయిలు పంపిణీ చేశారు. పట్టణంలోని ఆర్ అండ్ బి అతిథి గృహంలో తెలుగుదేశంపార్టీ రాష్ట్ర కార్యదర్శి చేవూరు విజయమోహన్‌రెడ్డికి మిఠాయిలు తినిపించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నూతన రాజధాని నిర్మాణాన్ని ముఖ్యమంత్రి ప్రపంచ ప్రమాణాలతో చేస్తుంటే ప్రతిపక్షం అసత్య ఆరోపణలు, నీచరాజకీయాలు చేయడం దురదృష్టకరమని ఆరోపించారు. గూడూరు నియోజకవర్గంలో వైకాపా ఇటీవల నిర్వహించిన నవరత్నాల కార్యక్రమంలో కొందరు నాయకులు తెలుగుదేశంపార్టీ నాయకులపై చేసిన వ్యాఖ్యలపై ఆయన తీవ్రంగా మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశంపార్టీ నాయకులు మధురెడ్డి, మధుసూదనరెడ్డి, వాటంబేడు శివకుమార్, చంద్రయ్య, శ్రీనివాసులు, మల్లిఖార్జున్‌రెడ్డి, అమరనాథ్‌రెడ్డి పాల్గొన్నారు.

# సమన్వయంతో ముందుకు సాగాలి




సభలో మాట్లాడుతున్న ఎంపి మేకపాటి, కాకాణి గోవర్ధన్‌రెడ్డి తదితరులు

రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న విధానాలకు వ్యతిరేకంగా ప్రజల్లోకి తీసుకెళ్లడం, పార్టీని క్షేత్రస్థాయిలో బలోపేతం చేసే దిశగా కార్యకర్తలు సమన్వయంతో ముందుకు సాగాలని ఎంపి మేకపాటి రాజమోహన్‌రెడ్డి అన్నారు. గూడూరు పట్టణంలో ఇటీవల వైకాపా గూడూరు నియోజకవర్గ బూత్ కమిటీ, ముఖ్య నాయకులు, కార్యకర్తలతో ప్లీనరీ నవరత్నాల సభ సిఆర్ రెడ్డి కళ్యాణ మండపంలో నియోజకవర్గ సమన్వయకర్త మేరిగ మురళీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వైకాపా జిల్లా అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డి, సీనియర్ నాయకుడు ఎల్లసిరి గోపాల్‌రెడ్డి, పద్మ నాభరెడ్డి, ఇంకా పలువురు నాయకులు మాట్లాడుతూ ప్రస్తుతం సీఎం చంద్రబాబు రోజుకో విధంగా అబద్ధం చెబుతూ కాలం వెళ్లదీస్తున్నారన్నారు.

ఈ కార్యక్రమంలో జిల్లా నియోజకవర్గ వైకాపా నాయకులు, వివిధ అనుబంధ సంస్థల నాయకులు పాల్గొన్నారు.

## మేషం



అశ్వని, భరణి, కృతిక 1 పాదము

ఉద్యోగులకు అధికారుల అనుకూలత సహచరుల ఆదరణ ఉంటుంది. కాంట్రాక్టర్లకు పారిశ్రామికవేత్తలకు వర్కర్లతో సమస్యలు రావచ్చును. స్థిరాస్తుల లావాదేవీలలో జాగ్రత్తపడండి. క్రొత్త వస్తువులు కొనడం, వస్తు వాహన రిపేర్ల ఖర్చులుంటాయి. దూరప్రాంతాల నుండి శుభ వార్తలు వింటారు. విద్యాప్రగతి బాగుంటుంది. వృత్తి వ్యాపారములందు ఆదాయం పెరుగుతుంది.

## వృషభం



కృతిక 2, 3, 4 పాదాలు, రోహిణి, మృగశీర్ష1, 2పాదాలు

బిడ్డల విద్యా వివాహ ఉద్యోగాలపై దృష్టి పెడుతారు. శుభవార్తలు వినడం, దూరం నుండి ఆహ్వానాలు అందు కొనడం జరుగుతుంది. ఉద్యోగులు సహచరులతోను, పైఅధికారులతోనూ సత్సంబంధాలు ఏర్పరచుకొంటారు. విలువైన వస్తువులు, నగదు జాగ్రత్త చేసుకొనండి. పారిశ్రామిక, కళా, సాంకేతిక రంగాలలో ప్రోత్సాహం బాగుంటుంది. ఉద్యోగావకాశాలు కలవు.

## మిధునం



మృగశీర్ష 3,4 పాదాలు, ఆర్ధ్ర, పునర్వసు 1, 2, 3పాదాలు

కోర్టు వ్యవహారాలు, బాకీల విషయంలో అనుకూలత ఉంటుంది. కుటుంబ సౌఖ్యం, ప్రశాంతత దొరుకుతుంది. అందరితో మంచిగా ఉంటూ పనులు జరుపుకొంటారు. ఉద్యోగ ప్రయత్నాలలో ఇంటర్వ్యూ అవకాశాలు దొరక గలవు. విద్యాప్రగతి, ఆరోగ్యం బాగుంటుంది. ఆదాయ వ్యయాలను ప్రణాళికా బద్ధంగా వ్యవహరిస్తారు. కుటుంబ వ్యవహారాలలో పట్టుదలకు పోకుండా సర్దుకొనిపోండి.

## కర్కాటకం



పునర్వసు 4 పాదం, పుష్య, ఆశ్లేష

ఉద్యోగ ప్రయత్నాలకు అవకాశాలు దొరుకుతాయి. ఆకస్మిక ప్రయాణాలుండగలవు. ఉద్యోగులు అధికారు లకు సంజాయిషీ చెప్పుకొనే పరిస్థితి ఉంది, కావున జాగ్రత్తపడండి. స్వల్పంగా అదనపు ఖర్చులుంటాయి. విద్యార్థులు చదువుపై దృష్టి పెడతారు. ప్రభుత్వ కార్యా లయాలలో మీ పనులకు అనుమతులు దొరుకుతాయి. కుటుంబసౌఖ్యం బాగుంది.

## సింహం



మఖ, పుబ్బ, ఉత్తర 1పాదము

క్రొత్త ఉద్యోగావకాశాలు పొందుతారు. స్టాక్ మార్కెట్, మార్కెటింగ్ రంగాలలో ప్రోత్సాహం ఆశా వహంగా ఉంటుంది. ఇంట శుభకార్య ప్రయత్నాలలో అనుకూలత ఉన్నది. కొంత బాకీ చెల్లింపులు జరుగ గలవు. అనుకోని ప్రయాణాలు ఉండగలవు. ఆరోగ్యం నెమ్మదిగా కుదుటపడుతుంది. మీ బలహీనతలను అదుపులో ఉంచుకొనాలి.

## కన్య



ఉత్తర 2, 3, 4 పాదాలు, హస్త, చిత్త 1, 2 పాదాలు

ఆర్థిక లావాదేవీలు వాయిదా వేసికొనడం మంచిది. స్టాక్ మార్కెట్ రంగాలు ఉద్యోగ ప్రయత్నాలలో అవకా శాలు ప్రోత్సాహకరంగా ఉండవు. రియల్ ఎస్టేట్, కాంట్రాక్టర్లు, పరిశ్రమల యజమానులకు కార్మికులతో సమస్యలు రాగలవు. విద్యార్థులకు శ్రద్ధ తగ్గుతుంది. శుభకార్యాల గురించిన ఆందోళన ఉంటుంది. శివ సహస్ర పారాయణం చేసికొంటే మంచిది.



## బ్రహ్మశ్రీ స్వయంపాకుల శ్రీనివాసులు

బాలాజీనగర్, నెల్లూరు

# రాశి - మీ వాసి

**తేది. 1.9.2017 నుండి**
**తేది. 7.9.2017 వరకు**

ఈ వారం ధనుర్మకర కుంభ మీన రాశులలో చంద్రుడు, కర్కాటకంలో శుక్రరాహువులు, సింహంలో రవికుజబుధులు, కన్యలో గురువు, వృశ్చికంలో శని, మకరంలో కేతువు సంచరిస్తారు.

**పంచాంగము:**

తేది 5 మంగళవారం అనంతపద్మనాభ స్వామి వ్రతము మరియు ఉపాధ్యాయ దినోత్సవం.
తేది 6 బుధవారము మహాలయపక్ష ప్రారంభము.
ముహూర్తములు లేవు.

### భాద్రపద మాస శుక్లపక్ష తిధులు

| | | | |
|---|---|---|---|
| తేది. 1 | శుక్ర | దశమి | ఉ॥ గం.6.23వ॥ |
| తేది. 2 | శని | ఏకాదశి | ఉ॥ గం.8.17వ॥ |
| తేది. 3 | ఆది | ద్వాదశి | ఉ॥ గం.9.54వ॥ |
| తేది. 4 | సోమ | త్రయోదశి | ఉ॥ గం.11.05వ॥ |
| తేది. 5 | మంగళ | చతుర్దశి | మ॥ గం.11.50వ॥ |
| తేది. 6 | బుధ | పూర్ణిమ | మ॥ గం.12.04వ॥ |

### భాద్రపద మాస కృష్ణపక్ష తిధులు

| | | | |
|---|---|---|---|
| తేది. 7 | గురు | పాడ్యమి | మ॥ గం.11.47వ॥ |

## తుల



చిత్త 3, 4 పాదాలు, స్వాతి, విశాఖ 1, 2, 3 పాదాలు

ఉద్యోగ ప్రయత్నాలు చేసేవారికి ఆశాజనకంగా ఉంటుంది. పాతమిత్రులను కలుసుకొనడం, క్రొత్త పరి చయాలు పెంచుకొనడం జరుగుతుంది. సోదరవర్గంతో సమస్యలుంటే సర్దుకుపోవడం మంచిది. విద్యార్థులు మంచి కృషి ప్రారంభించగలరు. ఆర్థికంగా బాగుంటుంది. వ్యాపారము గాని సొంత వృత్తి గాని అభివృద్ధి పరంగా సాగుతుంది. షేర్ మార్కెట్ ఆశావహంగా ఉండదు.

## వృశ్చికం



విశాఖ 4 పాదం, అనూరాధ, జ్యేష్ఠ

సాంకేతిక క్రీడా కళా రంగాల వారికి అవకాశాలు బాగుంటాయి. ఉద్యోగులకు గుర్తింపు గౌరవాలు బాగుం టాయి. ఉద్యోగ ప్రయత్నాలు చేసేవారికి అవకాశాలు దొరకగలవు. పనులందు టెన్షన్ పడుతుంటారు. విద్యా ప్రగతి బాగుంటుంది. కుటుంబ వ్యవహారాలు పరిష్కార దిశగా సాగుతాయి. ఖర్చులు అధికంగా ఉండినా ప్రయో జనం బాగుంటుంది.

## ధనుస్సు



మూల, పూర్వాషాఢ, ఉ.షాఢ 1 పాదము

కుటుంబ సౌఖ్యం బాగుంటుంది. అనవసర వ్యవహా రాలలో తలదూర్చకండి. ఉద్యోగులు సహచరులతోను ఉన్నతాధికారులతోను జాగ్రత్తగా మెలగండి. ఉద్యోగ ప్రయత్నాలలో అనుకూలత ఉన్నది. విద్యా ప్రగతి బాగుం టుంది. క్రొత్త వస్తువులు గృహోపకరణాలు కొంటారు. ఋణాలు చెల్లింపులు సకాలంలో చెల్లించగలరు. కార్య నిర్వహణలో ఆటంకాలు ఎదుర్కొంటారు.

## మకరం



ఉ.షాఢ 2, 3, 4 పాదాలు, శ్రవణ, ధనిష్ఠ 1, 2 పాదాలు

నిరుద్యోగుల ప్రయత్నాలు ఫలించే అవకాశాలు న్నాయి. పెద్దలతో సంప్రదించి ముఖ్య నిర్ణయాలు తీసి కొంటే మేలు జరుగుతుంది. విద్యా ప్రగతి బాగుంటుంది. సోదర, బంధువర్గంతో జాగ్రత్త పడండి. శుభకార్య ప్రయ త్నాలలో అనుకూల సందేశాలు లభిస్తాయి. ఇతరుల ప్రలోభాలు ఆకర్షణలకు లోబడకుండా నడుచుకొనండి. ఆర్థిక ఇబ్బందులుంటాయి.

## కుంభం



ధనిష్ఠ 3, 4 పాదాలు, శతభిష, పూ.భాద్ర 1,2,3 పాదాలు.

ఉద్యోగ ప్రయత్నాలలో ఇంటర్వ్యూ అవకాశాలు లభించగలవు. వస్తు వాహన రిపేర్లుంటాయి. శుభకార్య ప్రయత్నాలు ఎటూ తేలక సమస్య కాగలదు. కుటుంబ సభ్యుల కొరకు, అయిన వారి కొరకు అధికంగా ఖర్చు ఉంటుంది. విద్యా ప్రగతి బాగుంటుంది. వస్తువులు పోగొట్టుకొనకుండా చూచుకొనండి. అనవసర వ్యవ హారాల వల్ల ఆర్థిక భారం, బాధ్యత పైనబడగలవు.

## మీనం



పూర్వాభాద్ర 4 పాదం, ఉ.భాద్ర, రేవతి

కుటుంబ సౌఖ్యం బాగుంటుంది. శుభకార్య నిర్ణ యాలు జరిగే అవకాశం ఉన్నది. ఆత్మీయులు నుండి వర్తమానాలు అందుతాయి. గృహ మార్పు ప్రయత్నాలుం డగలవు. క్రొత్త వస్తువులు కొనడం, క్రొత్త పరిచయాలు ఏర్పడటం జరుగుతుంది. విద్యాప్రగతి బాగుంటుంది. స్వల్ప అనారోగ్య బాధలుండినా ఇబ్బంది పెట్టవు. బాకీలు, చెల్లింపులు కొంత పరిష్కారం కాగలవు.

# టీడీపీ గెలుపుతో వైసీపీ సంబరాలు

శ్రీను గల్పిక

*అది అదృష్టం కలిసొచ్చి 1400కోట్ల అభివృద్ధి పనులను ఒకే నెలలో మొదలు పెట్టిన నంద్యాల పట్టణం. ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీ వద్ద తెలుగుదేశం నాయకులు కోలాహలంగా వున్నారు. అప్పుడే కౌంటింగ్ పూర్తయ్యి తెలుగుదేశం అభ్యర్థి భూమా బ్రహ్మానందరెడ్డి గెలిచినట్లు ప్రకటించారు. తెలుగుదేశం గెలవడంతో అక్కడికి చేరుకున్న మంత్రులు, నంద్యాల టీడీపీ ఓఎస్డి సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి, దేవగుడి ఆదినారాయణరెడ్డి, ఆకే అమర్‌నాథ్‌రెడ్డి, భూమా అఖిలప్రియ, దేవినేని ఉమామహేశ్వరరావు, పత్తిపాటి పుల్లారావు, టీడీపీ నాయకులు ఫరూఖ్, ఎస్వీ సుబ్బారెడ్డి, ఏ.వి.సుబ్బారెడ్డిలు రంగులు చల్లుకుంటూ, స్వీట్లు పంచు కుంటూ, ఔట్లు కాల్చుకుంటూ సంబరాలు జరుపుకుంటున్నారు. ఓ అరగంట పాటు ఎగిరాక అందరూ అలసిపోయారు. అప్పుడు భూమా అఖిలప్రియ వుండి... హమ్మయ్యా, నాకు మంత్రి పదవికి రాజీనామా చేసే బాధ తప్పింది. మన మందరం ఇక విజయవాడ వెళ్లి మన ప్రియతమ నాయకులు చంద్రబాబు, లోకేష్‌లతో కలిసి విజయోత్సవం జరుపుకుందామని చెప్పింది. దానికి అందరూ సరేనని విజేత భూమా బ్రహ్మానందరెడ్డిని కారులో ఎక్కించుకుని విజయవాడకు బయల్దేరారు. కార్లలో ఎక్కిన తర్వాత మంత్రులు ఎవరి పాటికి వాళ్ళు తమను చూడగానే చంద్రబాబు ఎలా రియాక్ట్ అవుతాడన్నది వూహించుకోసాగారు.*

***భూమా అఖిలప్రియ :*** *అఖిలను చూడగానే చంద్రబాబు భుజం తట్టి వెల్‌డన్ అఖిల వెల్‌డన్... చిన్నపిల్లవు కాదు పెద్ద పిడుగువు అనిపించుకున్నావు... నీలాంటి వాళ్లేనమ్మా మన పార్టీకి వెన్నెముకలు... వచ్చే ఎన్నికల తర్వాత నిన్ను ఉపముఖ్యమంత్రిని చేస్తాను...*

***దేవగుడి ఆదినారాయణరెడ్డి :*** *ఆది నారాయణ... నువ్వు తెలుగుదేశంలోకి రాకపోయుంటే నా పరిస్థితేంటి... నంద్యాలలో తెలుగుదేశాన్ని గెలిపించేదెవరు? నీలాంటి మొనగాళ్లే పార్టీకి కావాలి... నీ కోసం నేను ఎవరినైనా(రామసుబ్బారెడ్డి) వదులుకోవడానికి సిద్ధం... నీలాంటి వాళ్ళు నలుగురు నా పక్కన వుంటే చాలు... ఈ రాష్ట్రాన్ని ఇంకో నలభై ఏళ్ల పాటు ఏలుతా... శెభాష్ ఆది... శెభాష్... అంటూ భుజం, వీపు తట్టాడు.*

***సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి :*** *నంద్యాల నుండి బయలుదేరిన అందరూ అప్పుడే చంద్రబాబు ఇంటి వద్ద ఆగారు. చంద్రబాబు చేతిలో పెద్ద లడ్డు పట్టుకుని వున్నాడు. వీరిని చూడగానే చంద్రబాబు ఆనందంతో పరుగెత్తుకుంటూ రాసాగాడు. చంద్రబాబు చేతిలో వున్న లడ్డు తనకోసమేనని విజేత భూమా బ్రహ్మానందరెడ్డి నోరు తెరిచాడు. కాని, చంద్రబాబు అతనిని పక్కకు నెట్టి నేరుగా సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డిని కౌగిలించుకుని అతని నోట్లో లడ్డు పెట్టాడు. ఈ హఠాత్ పరిణామానికి అందరూ బిత్తరపోయారు. చంద్రబాబు సోమిరెడ్డిని పట్టుకుని గట్టిగా ఏడుస్తూ... నీలాంటి డైమండ్‌కు మంత్రి పదవి ఇవ్వకుండా చెప్పుడు మాటలు విని చాలాకాలం దూరం పెట్టాను. నీలాంటి వ్యక్తి నా కేబినెట్‌లో వుంటే ఎంత ఉపయోగమో ఇప్పుడు తెలిసొచ్చింది. నంద్యాల విజయం నీదే... నీ కృషి వల్లే ఇంత మెజార్టీ వచ్చింది. ఈ జన్మలో నీ ఋణం తీర్చుకోలేను అని చెప్పాడు. సోమిరెడ్డి ఆయనను అనునయిస్తూ... ఏ విజయమైనా మేం మీ బాటలో నడవబట్టి వచ్చిందేనన్నా అని మార్కులు పెంచుకునే ప్రయత్నం చేశాడు.*

*వీళ్లందరూ ఇలా ఊహల్లో ఉండగానే ఉండవల్లిలో చంద్రబాబు ఇల్లు రానే వచ్చింది. చంద్రబాబు ఇంటి వద్ద తమకు భారీ స్వాగత సత్కారాలు ఉంటాయని ఊహిస్తూ అందరూ కార్లు దిగారు. కాని, అక్కడున్న వాతావరణాన్ని చూసి అందరూ షాకయ్యారు. బయట ఎటువంటి విజయోత్సవాలు లేవు, సంబరాలు ఇంటిలోపలేమన్నా ప్లాన్ చేసారేమోనని లోపలకు వెళ్లారు. అక్కడ వాతావరణం చూసి ఇంకా ఖంగుతిన్నారు. ఇల్లంతా బోసిపోయి వుంది. ఒక్కరు లేరు. అప్పుడే చంద్రబాబు గదిలో నుండి పి.ఎస్ బయటకు వచ్చాడు. సీఎం గారు ఎక్కడున్నారని అతనిని సోమిరెడ్డి అడిగాడు. నంద్యాల ఫలితంపై సార్ చాలా సీరియస్‌గా వున్నారని అతను చెప్పాడు. ఆ మాటకు అందరికీ కంబైన్డ్‌గా మైండ్ బ్లాక్ అయ్యింది. పొరపాటున ఇతనికి ఎవరన్నా వైసిపి గెలించిందని చెప్పారా... ఆ వై.యస్ ఊరకే అనలేదు... నవ్వడం ఒక భోగం... నవ్వలేక పోవడం ఒక రోగం అని... ఇంత భారీ మెజార్టీతో గెలిచాక కూడా ఆయన నంద్యాల ఫలితంపై సీరియస్‌గా వుండడమేమిటి... అనుకుంటూ అందరూ చంద్రబాబు గదిలోకి అడుగు పెట్టారు. ఆయన ముఖం మాడిపోయిన మసాలా దోశె మాదిరిగా వుంది. సార్, నంద్యాలలో మనం ఓడిపోలేదు, భారీ మెజార్టీతో గెలిచాం అని సోమిరెడ్డి చెప్పాడు. అది విన్న చంద్రబాబు... అదే నా బాధ అని అన్నాడు. గెలిస్తే బాధెందుకు సార్... ఆనందించాలి గాని అని అఖిలప్రియ అంది. నా బాధ మీకేం తెలుస్తుంది. మీరే చూడండి, అంటూ టీవీ ఆన్ చేసి 'ఆత్మసాక్షి' ఛానెల్ పెట్టాడు. ఆ ఛానెల్‌లో వస్తున్న దృశ్యాలు చూసి అందరూ అవాక్కయ్యారు. హైదరాబాద్‌లో వైకాపా కేంద్ర కార్యాలయం. ఎంపీలు విజయసాయిరెడ్డి, వై.వి.సుబ్బారెడ్డి, మేకపాటి రాజమోహన్‌రెడ్డి, రేణుక, వైకాపా నాయకులు రోజా, అంబటి రాంబాబు, కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, పి.అనిల్ కుమార్, చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డిలు రంగులు చల్లుకుంటూ స్వీట్లు పంచుకుంటూ ఆనందంతో డ్యాన్స్‌లు వేస్తున్నారు. అప్పుడే ఆత్మసాక్షి రిపోర్టర్ సాక్షిశివానంద్... అంబటి రాంబాబు నోటి ముందు మైకు పెట్టి... నంద్యాలలో ఓడిపోయినా సంబరాలెందుకు చేసుకుంటున్నారని ప్రశ్నించాడు. అందుకు అంబటి రాంబాబు... మాకు ఉపఎన్నికల్లో గెలుపు పెద్ద సెంటిమెంట్. ఉపఎన్నికల్లో గెలిచామంటే సాధారణ ఎన్నికల్లో గెలవం. 2012 ఉపఎన్నికోల్ల గెలిచాం కాబట్టే 2014 ఎన్నికల్లో ఓడి పోయాం. అదే 2012 ఉపఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ పరిస్థితి చూడండి... ఆ పార్టీకి ఏ అసెంబ్లీ స్థానంలోనూ డిపాజిట్ కూడా దక్కలేదు. మరి 2014 ఎన్నికల్లో ఆ పార్టీ అధికారంలోకి వచ్చింది కదా. కాబట్టి ఈ నంద్యాల ఉపఎన్నికల్లో ఓడిపోవడమన్నది మాకు సంతోషం కలిగించే విషయమే! ఈరోజు దాకా కూడా కొంపదీసి ఎక్కడ నంద్యాలలో గెలుస్తామోనని టెన్షన్ పడ్డాం. ఇప్పుడు నంద్యాల ఉపఎన్నికల్లో ఓడిపోయాం కాబట్టి ఆ టెన్షన్ నుండి బయటపడ్డాం! ఉపఎన్నిక సెంటిమెంట్‌ను మేము అధిగ మించాం. కాబట్టి, 2019 ఎన్నికల్లో గెలుపు మాదే... ఇందులో తిరుగు లేదు అని చెప్పి తిరిగి ఆనందంతో చిందులు తొక్కసాగాడు. టీవీలో ఆ సీన్ చూసిన తెలుగుదేశం నాయకులు అట్టే నోర్లు తెరిచేసారు.*

# కళ్యాణ వైభవం...!



తెలుగుదేశం నాయకులు అరిగెల కోదండరామయ్య మనుమరాలు, టి.యస్.కళ్యాణ్‌కుమార్ - రజనిల కుమార్తె **గౌరి అభినయ - రవిచంద్ర** (వైజాగ్ వాస్తవ్యులు కడియాల సూర్యప్రకాశరావు - విజయలక్ష్మిల కుమారుడు)ల కళ్యాణం ఆగస్టు 16వ తేదీ నెల్లూరులోని పావని గార్డెన్స్‌లో జరిగింది. వధూవరులకు 'లాయర్' శుభాకాంక్షలు.



హైదరాబాద్ నివాసి, నెల్లూరుజిల్లా తలమంచి వాస్తవ్యులు డాక్టర్ జొన్నా సుబ్బయ్య - రాజేశ్వరిల మనుమడు, డా॥ జొన్నా రాధాకృష్ణ - డా॥ ఝూన్సీలక్ష్మిల కుమారుడు **గౌతమ్ - అనిత** (డా॥ అన్నపూర్ణ ప్రసాద్ యార్లగడ్డ - సుజాతల కుమార్తె)ల వివాహం ఇటీవల అమెరికాలో జరుగగా, రిసెప్షన్ వేడుక ఆగస్టు 23వ తేదీ హైదరాబాద్‌లోని తాజ్ డక్కన్ హోటల్ నందు జరిగింది. నూతన దంపతులకు 'లాయర్' శుభాశీస్సులు.



నెల్లూరు వాసి, హైదరాబాద్‌లో ఉంటున్న మారు సుధాకర్‌రెడ్డి - సునీలారెడ్డిల కుమారుడు **రోహిత్‌రెడ్డి - స్నిగ్ధరెడ్డి** (తాడి రామ్‌కుమార్‌రెడ్డి - శ్రీదేవిల కుమార్తె)ల పెళ్ళి ఆగస్టు 17వ తేదీ హైదరాబాద్‌లోని ఎన్ కన్వెన్షన్ సెంటర్ నందు జరిగింది. కొత్త జంటకు 'లాయర్' శుభదీవెనలు.

# కందుకూరులో తెలుగు భాషాదినోత్సవం




వ్యావహారిక భాషోద్యమ స్థాపకుడు గిడుగు రామమూర్తి పంతులుగారు తెలుగుభాషకు ఒక అపూర్వమైన వరమని, గిడుగు వారు చేసిన తెలుగు భాషా సేవ ఎంతో అమూల్యమైనదని ప్రముఖ బాల సాహితీవేత్త డా.గంగిశెట్టి శివకుమార్ అన్నారు. గిడుగు రామమూర్తిపంతులు జయంతి సందర్భంగా గత నెల 27న ప్రకాశం జిల్లాలోని కందుకూరు జడ్పీ ఉన్నత పాఠశాలలో జరిగిన తెలుగు భాషా దినోత్సవ కార్యక్రమంలో ఆయన పాల్గొని గిడుగువారు తెలుగు భాషామతల్లికి చేసిన అపూర్వమైన సేవలను వివరించారు. ఈ కార్యక్రమానికి సాహితీ విభాగం కన్వీనర్ ఇనకొల్లు మస్తానయ్య అధ్యక్షత వహించారు. అనంతరం ప్రకాశం జిల్లా రచయితల సంఘం ప్రధాన కార్యదర్శి పొన్నూరు శ్రీనివాసులు మాతృభాష ప్రాధాన్యత గురించి ఉపన్యసించారు. అనంతరం డా. గంగిశెట్టిని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ కవి బొగ్గరపు రాధాకృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

# పేదల ఇళ్ళ నిర్మాణాలకు చేయూత

## - మాజీ ఎమ్మెల్యే బీద మస్తాన్‌రావు



కావలి కబుర్లు

కావలి నియోజకవర్గంలో ప్రభుత్వం చేపట్టిన గృహనిర్మాణాలను సత్వరం పూర్తిచేయాలని సంబంధిత అధికారులకు విజ్ఞప్తి చేశామని, అదేవిధంగా పేదల ఇళ్ళ నిర్మాణాలకు తనవంతు సహకారం అందిస్తానని కావలి మాజీ ఎమ్మెల్యే బీద మస్తాన్‌రావు అన్నారు. కావలిలోని 1వ వార్డు, మద్దూరుపాడులో పట్టణ గృహ నిర్మాణ పథకానికి కేటాయించిన స్థలాన్ని ఇటీవల ఆర్డీఓ భక్తవత్సలరెడ్డి, మునిసిపల్ కమిషనర్ ఎ.వెంకటేశ్వర్లు, హౌసింగ్ అధికారులు, టిడ్కో ప్రతినిధులు, నాగార్జున కన్‌స్ట్రక్షన్ కంపెనీవారితో కలిసి బీదా సందర్శించారు. అక్కడ అసంపూర్తిగా ఉన్న ఇంటిని పూర్తిచేసుకునేందుకు బ్రహ్మయ్య అనే వ్యక్తికి అయిదువేల రూపాయలను బిఎంఆర్ ఛారిటబుల్ ట్రస్ట్ తరపున బీదా అందజేశారు. అనంతరం 1వ వార్డులో గృహనిర్మాణ పథకం అమలు తీరును సమీక్షించారు. నిర్మాణంలో ఉన్న ఇళ్ళను పరిశీలించి, వారి సమస్యలను తెలుసుకున్నారు. బిల్లులను త్వరగా చెల్లించడం, అవసరమైన ఇసుక, సిమెంటు అందుబాటులో ఉండేట్లుగా చేయడం తదితర చర్యలపై ఆయన అధికారులతో కలసి చర్చించారు. అధికారులు అందుకు స్పందిస్తూ, త్వరలో గృహనిర్మాణాలను పూర్తిచేస్తామన్నారు. ఈ సందర్భంగా బీద మస్తాన్‌రావు వెంట పట్టణ టిడిపి అధ్యక్షుడు అమరా వేదగిరి గుప్తా, 17వ వార్డు కౌన్సిలర్ శెట్టిపల్లి మధు, పోతుగంటి శ్రీకాంత్, కొండా వెంకట్రావ్ తదితరులున్నారు.

# 'సంయుక్త' సేవలు అభినందనీయం

## - ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్ ప్రశంస



కావలి పట్టణంలోని సంయుక్త సేవాసంస్థ సేవలు అభినందనీయమని కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి ప్రశంసించారు. స్థానిక రెడ్‌క్రాస్ భవనంలో సంయుక్త సేవా సంస్థ ఆధ్వర్యంలో గత నెల 28న పేదలకు, దివ్యాంగులకు బియ్యం, ఇతర నిత్యావసర వస్తువులను పంపిణీచేశారు. అనంతరం అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమాలకు తన తండ్రి గంధం పిచ్చయ్య 36వ వర్ధంతి సందర్భంగా, వారి కుమారుడు జిల్లా రెడ్‌క్రాస్ పాలకమండలి సభ్యుడు గంధం ప్రసన్నాంజనేయులు ఆర్థిక సాయం చేశారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ, మంచి మనసు ఉంటే సామాన్యులు కూడా మంచి సేవా కార్యక్రమాలు నిర్వహించవచ్చని 'సంయుక్త' సురేంద్ర నిరూపించారన్నారు. అనంతరం జరిగిన రక్తదానశిబిరంలో 50వ సారి రక్తదానం చేసిన గంధం ప్రసన్నాంజనేయులను ఎమ్మెల్యే అభినందించారు.

# తల్లిదండ్రుల పట్ల కాఠిన్యం చూపకండి

## - అందరినీ ఆకట్టుకున్న సందేశం



శ్రీకాళహస్తి న్యూస్

జన్మనిచ్చిన తల్లిదండ్రుల పట్ల బిడ్డలు కాఠిన్యం చూపకూడదని, అమ్మ ప్రాణం పోసి జీవం ఇస్తే, ఆ జీవానికి రూపం ఇచ్చి వ్యక్తిత్వాన్ని ఇచ్చేది తండ్రేనని, అలాంటి తల్లి దండ్రుల పట్ల పిల్లలు ఎట్టి పరిస్థితు ల్లోనూ కాఠిన్యం చూపకూడదనే సందేశంతో శ్రీకాళహస్తిలోని నవ భారత్ యువజన సంఘం వారు వినాయక చవితి సందర్భంగా ఏర్పాటు చేసిన 'వృద్ధాశ్రమాలు' చిత్రం స్థానిక ప్రజలను బాగా ఆకట్టుకుంది.

శ్రీకాహస్తిలోని బాబు అగ్రహారంలోని కోనేరు వద్ద నవభారత్ యువజన సంఘం నిర్వాహకులు గరికపాటి రమేష్‌బాబు, గరికపాటి సుధాకర్ అనే సోదరులు ఈ సందేశాన్ని కళ్ళకు కట్టినట్లుగా చిత్రించారు. కన్నబిడ్డలను కంటికి రెప్పలా కాపాడుకున్న ఎందరో తల్లిదండ్రులు వృద్ధాప్యంలో చివరికి వృద్ధాశ్రమాల పాలవుతున్నారని, అలా తల్లిదండ్రులను వృద్ధాశ్రమంలో వదిలేయడం ఎంతో విచారకరమని ఆ సందేశం ద్వారా తెలిపారు. వృద్ధాశ్రమాల్లో ఉన్న తల్లిదండ్రులు తమ కన్నబిడ్డలను వదులుకోలేక నిరంతరం దిగులుతో రోదిస్తున్నారని, తమను పిల్లలు వదిలేశారనే ఆవేదనతో ఎంతోమంది తల్లిదండ్రులు తనువు చాలిస్తున్నారని, ఇంతకన్నా బాధాకరమైన విషయం మరొకటి లేదని వారు ఈ సందేశంలో చాటిచెప్పారు.

ప్రత్యక్షదైవాలైన తల్లిదండ్రులను ఇంత ఘోరంగా వృద్ధాశ్రమాలకు పంపడం దారుణమని, పిల్లల జీవితాలకోసం తమ జీవితాలను ధారబోసే తల్లిదండ్రుల పట్ల ఎవరూ కాఠిన్యం చూపకుండా వారిని సంరక్షించుకోవాలని వారు పిలుపునిచ్చారు. ఈ సందేశం అందరినీ ఆకట్టుకోవడమే కాక, ఎంతోమందిని చలింపజేసింది.

# మాటతీరు మారాలి

రాజకీయాలలో సర్పంచ్ స్థాయి నాయకులకో భాష ఉంటుంది, ఎమ్మెల్యే స్థాయి నాయకులకో భాష ఉంటుంది, ముఖ్యమంత్రుల స్థాయిలో ఓ భాష ఉంటుంది, జాతీయ స్థాయి నాయకులకో భాష ఉంటుంది. ఇక్కడ భాష అంటే తెలుగు, తమిళం, ఆంగ్లం అని కాదు... నాయకులు మాట్లాడే పద్ధతి అని. సర్పంచ్ స్థాయి నాయకుడు తన్నండి, నరకండి అంటే ప్రజలు పెద్దగా పట్టించుకోరు. ఎందుకంటే అతను గ్రామస్థాయి నాయకుడు మాత్రమే! కాని, ఒక రాష్ట్రస్థాయి నాయకుడి నోటి నుండో, జాతీయ నాయకుడి నోటి నుండో అలాంటి మాటలు వస్తే ప్రజలు పట్టించుకుంటారు. రాజకీయాలలో మాట తీరు హుందాగా వుంటేనే నాయకులు రాణిస్తారు.

నేటి రాజకీయాలలో వైకాపా అధినేత జగన్ మొనగాడే! మహామహులే తలవంచిన సోనియాగాంధీని ఢీకొట్టాడు. 16 నెలలు జైల్లో వున్నాడు. పెద్దపెద్ద యోధులే ప్రాంతీయ పార్టీలను నడపలేని నేటి రోజుల్లో కాంగ్రెస్ పార్టీ నుండి బయటకొచ్చాడు. వైయస్సార్ కాంగ్రెస్‌పార్టీని స్థాపించాడు. 2014లో తృటిలో అధికారం తప్పిపోయినా, 70మంది ఎమ్మెల్యేలను గెలిపించుకున్నాడు. ఇక ప్రజాక్షేత్రంలోకి వెళ్లాడంటే అలుపెరుగని పయనమే! అధికార పార్టీ వాళ్లకు ఎక్కడా బెదరడం లేదు, తగ్గడం లేదు. ప్రజల్లోకి వెళ్లాడంటే వారితో మమేకమవుతున్న తీరు అభిమానం, ఆత్మీయతకు అద్దం పడుతోంది. ఈరోజుకీ ప్రజలు అభిమానంతో పోటెత్తి వచ్చే ఏకైక రాజకీయ నాయకుడు వైయస్ జగన్మోహన్‌రెడ్డే! రాష్ట్రంలో గత ఆరేళ్లలో అతను కలుసుకున్నంత మంది ప్రజలను, అభిమానులను ఇంకే నాయకుడు కలుసుకుని వుండడంటే అతిశయోక్తి కాదు.

జగన్‌లో రాజకీయ నాయకుడిగా, ప్రజా నాయకుడిగా అన్ని లక్షణాలు వున్నాయి. కాకపోతే మాటతీరే కొంచెం మారాలి. ప్రభుత్వం మీద, ప్రభుత్వాధినేత మీద విమర్శలు, ఆరోపణలు చేయవచ్చు. అవి అర్థవంతంగా, ఆలోచింపజేసే విధంగా వుండాలే గాని, మన విమర్శలు మనకే చేటు తెచ్చేలా కాదు. నంద్యాల ప్రచారంలో చంద్రబాబును నడిరోడ్డుపై కాల్చినా తప్పులేదు అని ఆయన మాటలు ఎంత దూరం వెళ్లాయో చూసాము. ఇటువంటి మాటలను ప్రజలు స్వీకరించరు. అది కూడా ముఖ్యమంత్రి స్థాయికి పోటీ పడుతున్న నాయకుడంటే ఆమోదించరు. ప్రత్యర్థులే కాదు, సొంత పార్టీ వాళ్ళు, తటస్థులు, విజ్ఞులు కూడా ఇలాంటి మాటలను అంగీకరించరు. మరి ఈ మూడేళ్లలో తెలుగుదేశం వాళ్లు చాలా కారుకూతలు కూసారు కదా... అనే ప్రశ్న రావచ్చు. ఆ కారుకూతలు కూసిన వాళ్లను ప్రజలు అభిమానించడం లేదు. ఇక్కడ ప్రజలు జగన్‌ను అభిమానిస్తున్నారు. కాబట్టే ఆయన నోట అలాంటి మాటలను ఆమోదించరు.

మొన్న నంద్యాల ఫలితం రాగానే విలేకరుల ముందు జగన్ మాట్లాడిన మాటలు కూడా రాజకీయాల్లో ఆమోదయోగ్యం కాదు. 'మమ్మల్ని దెబ్బ కొట్టారు, మాకు గుండె ధైర్యం వుంది, మేం దెబ్బ తట్టుకుని నిలబడ్తాం, మాకూ టైం వస్తుంది, మేమూ దెబ్బ కొడతాం...' ఇలాంటి మాటలు వీధి గొడవల్లో పనికొస్తాయేమో గాని, రాజకీయ క్రీడలో కాదు. ఓటమిని అంగీకరిస్తున్నాం, ప్రజాతీర్పును గౌరవిస్తాం, అధికార పార్టీ ప్రలోభాలు పని చేసాయి. ప్రజల పరిస్థితిని మేం అర్థం చేసుకున్నాం అని నాలుగు ముక్కలు చెప్పి సరిపెట్టి వుంటే ఎంతో హుందాగా వుండేది. దెబ్బతిన్నాం, దెబ్బ కొడతాం అనే మాటలను ప్రజలు హర్షించరు. ఎందుకంటే జగన్ వీధి నాయకుడు కాదు... రాష్ట్ర నాయకుడు. కాబట్టి మాట తీరు మార్చుకోవాలి.

## 'తెలుగుభాష గొప్పదనం'పై వక్తృత్వ పోటీలు



వ్యావహారిక భాషోద్యమ పితామహుడు గిడుగు రామమూర్తి పంతులు 125వ జయంతి సందర్భంగా నెల్లూరులోని గిరిజన సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలో గత నెల 27న బాలికలకు వక్తృత్వ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో పి.లావణ్యకుమారి ప్రథమస్థానం, ఎం.శ్రీవల్లి ద్వితీయస్థానం, సిహెచ్ లోకేశ్వరి తృతీయస్థానం సాధించి బహుమతులందుకున్నారు. ఎం.ప్రవల్లిక, యామిని ప్రోత్సాహక బహుమతులను అందుకున్నారు. ఈ కార్యక్రమంలో పెరసం అధ్యక్షుడు అవ్వారు శ్రీధరబాబు, ప్రధాన కార్యదర్శి గుండాల నరేంద్రబాబు వ్యవస్థాపకఅధ్యక్షులు మోపూరు పెంచల నరసింహం, కార్యనిర్వాహక కార్యదర్శి జి. సుభద్రాదేవి, గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ దేవసహాయం తదితరులు పాల్గొన్నారు.

# తెలుగుభాషకు కొత్తవెలుగు...'గిడుగు'

***కొందరు పుడుతూనే గొప్పవారుగా పుడతారు. మరికొందరు స్వయం శక్తితో, స్వయంకృషితో జీవితంలో గొప్పతనాన్ని సాధిస్తారు. ఇలాంటి మహాపురుషులు మనకెందరో ఉన్నారు. కృషి ఉంటే మనుషులు రుషులవుతారన్న చందంగా, ఇంకా ఎందరో మహనీయులు సమాజోద్ధారణకు తమ జీవితాలను అంకితం చేశారు. అలాంటి మహానుభావుల్లో తెలుగు భాషకు కొత్త వెలుగులు ప్రసాదించిన గిడుగు రామమూర్తిపంతులుగారు ఎన్నదగినవారు. ఆయన కారణజన్ములు. వ్యవహార భాషోద్యమ స్థాపకులైన గిడుగు తెలుగుభాషోన్నతికి చేసిన సేవలు అమూల్యం..అపారం. నాటికీ, నేటికీ గిడుగువారంటే అందరికీ ఎంతో అభిమానం..గౌరవం. వ్యావహారిక భాష కోసమే ఆయన పుట్టారని కొందరు, సవరలకు, వారి భాషాభ్యున్నతికి కృషి చేయడానికే పుట్టారని మరికొందరు అంటూ ఉంటారు. ఇవే కాక, ఆయన తన జీవితకాలంలో అటు భాషాభ్యుదయానికి, తద్వారా సమాజాభ్యుదయానికీ చేసిన సేవలు ఎన్నో.. ఎన్నెన్నో!...***



గిడుగు వారి తండ్రి వీర్రాజు సముద్దారు. అప్పట్లో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తూ ఉండే వారు. తల్లి వెంకమాంబ. 29.8.1863లో ఈ పుణ్యదంపతులకు గిడుగు రామమూర్తి జన్మించారు. వీరి స్వస్థలం విజయనగరం జిల్లా పర్వతాల పేట గ్రామం. గిడుగు రామమూర్తిపంతులు పదమూడేండ్ల వయసులో ఉన్నప్పుడే తండ్రిగారు విషజ్వరంతో పరమపదించారు. తల్లి తన వద్ద ఉన్న నగలను అమ్మివేసి గిడుగును మెట్రిక్యులేషన్ దాకా చదివించింది. అప్పట్లో గురజాడ అప్పారావు గారు గిడుగు రామమూర్తిపంతులుగారికి సహాధ్యాయి, మంచి మిత్రుడు కూడా. ఆనాటి కుటుంబ పరిస్థితుల కారణంగా గిడుగు చిన్నవయసులోనే వివాహం చేసుకోవాల్సి వచ్చింది. తన తల్లితో పాటు, పెళ్ళికాని చెల్లెలు, మరికొందరు బంధువుల బాధ్యత, కుటుంబ బాధ్యత అంతా గిడుగువారిపైనే పడింది. మామగారు కూడా చనిపోతే ఇద్దరు బావమరుదుల్ని, అత్తగారిని తన ఇంట్లోనే ఉంచుకుని పోషించాల్సివచ్చింది. ఇన్ని బాధ్యతలు పైన ఉండగానే, విద్యపై ఎంతో ఆసక్తితో ప్రైవేట్‌గా చదువుకుంటూ ఎం.ఏ ఉత్తీర్ణులయ్యారు.

అప్పట్లో తాను పనిచేస్తున్న మిడిల్ స్కూల్ ఆ తర్వాతికాలంలో హైస్కూల్‌గా, సెకండరీగ్రేడ్ కళాశాలగా వృద్ధి పొందడంతో, గిడుగు వారి హోదా కూడా పెరిగింది. పర్లాకిమిడి గ్రామంలో తాను ఉద్యోగబాధ్యతలు నిర్వర్తిస్తున్న సమయంలో విద్యార్థుల కోసం రీడింగ్‌రూం ఏర్పాటుచేశారు. పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తూ విద్యార్థులకు ఉత్సాహాన్ని, ప్రోత్సాహాన్నీ అందించేవారు. పర్లాకిమిడి రాజాగారి సోదరుడు పద్మనారాయణదేవ్‌కు ట్యూటర్‌గా కూడా పనిచేసేవారు. ఆ తర్వాత ఆయన దృష్టి పర్లాకిమిడి పరిసరప్రాంతాలపై పడింది. చుట్టుపక్కల ఉన్న కొండ కోనల్లో నాగరికతకు దూరంగా ఉన్న 'సవరల' దుస్థితి ఆయన హృదయాన్ని కదిలించివేసింది. సవరలకు మంచి భాష నేర్పాలంటే, వారి భాషను తాను ముందుగా నేర్చుకోవాలి, అందుకు సవర ప్రజలతో కలిసిమెలిసి కాలం గడపాలి అనుకున్నారు. అలా ఉంటూనే, సవర భాష తెలిసిన ఒకరి ఇంటికెళ్ళి ఆయనవద్ద సవర భాష నేర్చుకుంటూనే, వేసవి సెలవుల్లో కొండల మీద గడుపుతూ, సవర వారి భాష, వారి జీవన విధానాలు, ఆటపాటలు, ఆచార వ్యవహారాలు ఎంతో సంయమనంతో ప్రత్యక్షంగా అధ్యయనం చేశారు. ఇంతలో మలేరియా జ్వరం రావడంతో ఏవో కొన్ని మాత్రలు మింగారు. దాంతో ఆయనకు చెవులు వినలేని పరిస్థితి దాపురించింది. అయినప్పటికీ ఏమాత్రం వెనుకడుగు వేయలేదు. సవర భాషాసేవ మానలేదు.వారి భాషను బాగా నేర్చుకున్నారు. సవర భాషలో పలు పుస్తకాలు రాశారు. సొంత డబ్బుతో వారికి పాఠశాలలు పెట్టి, అధ్యాపకులకు ఆయనే జీతాలు చెల్లించి సవరలకు వారి భాషలోనే బాగా చదువు చెప్పేవిధంగా శ్రద్ధతీసుకున్నారు. ఎక్కడో మారుమూల కొండల్లో నివసించే సవరలకు గిడుగు రామమూర్తిపంతులుగారు చేస్తున్న భాషాసేవను గుర్తించిన నాటి మద్రాసు ప్రభుత్వం ఆయనకు 1913లో 'రావుబహదూర్' అనే విశిష్టమైన బిరుదును ప్రదానం చేయడం ఎంతో విశేషం. ఆ తర్వాత గిడుగు వారు మరెంతో కృషిచేసి, ఆంగ్లభాషలో సవరభాషా వ్యాకరణాన్ని, సవర-ఇంగ్లీషుభాషల డిక్షనరీని అందరికీ ఉపయోగపడే రీతిలో అద్భుతంగా రూపొందించారు. మద్రాస్ ప్రభుత్వం వాటిని అచ్చువేసింది కూడా. దీంతో పాటు, 1914లో ఆయనకు 'కైజర్-ఇ-హింద్' అనే స్వర్ణపతకాన్ని కూడా ప్రదానం చేసి గౌరవించిందంటే, గిడుగువారు సవరల భాషోన్నతికి ఎంతగా కృషిచేశారో అర్థం చేసుకోవచ్చు.

గిడుగువారికి భాషల పట్ల ఆసక్తి మెండుగా ఉండేది. హైస్కూల్‌లో చరిత్ర పాఠాలు చెప్పే రోజుల్లోనే, ఆ ప్రాంతంలో ఉన్న 'ముఖలింగం' దేవాలయాల్లోని శాసనాల లిపిని అర్థం చేసుకోవడానికి పట్టుదలతో ఆ లిపిని నేర్చుకుని ఆ శాసనాలను చదివేవారు. విషయ పరిశోధన చేసి, వాటి ఆధారంగా చరిత్రలో గంగవంశీయుల గురించి ఆంగ్లంలో ప్రామాణికమైన వ్యాసాలను రాశారు. ఉద్యోగంలో 30 ఏళ్ళు సర్వీసు పూర్తికాగానే స్వచ్ఛందంగా ఉద్యోగ విరమణ చేశారు. అంతకుముందు నుంచే గిడుగు వారు ఆధునికాంధ్ర భాషా సంస్కరణ వైపు దృష్టి పెట్టారు. జె.ఏ ఏట్స్ దొర అనే ఆంగ్లేయ విద్యాధికారి ప్రోత్సాహంతో, మిత్రులైన గురజాడ, శ్రీనివాస అయ్యంగార్‌ల తోడ్పాటుతో వ్యావహారిక భాషోద్యమానికి బాటలు వేశారు. ప్రజలు వ్యవహరించే భాషే పుస్తకాల్లోనూ ఉంటే ఆ భాష ప్రజలకు మరింత దగ్గరవుతుందని, అప్పుడు విద్య అందరికీ మరింతగా అందుబాటులోకి వస్తుందని గిడుగువారి స్థిరమైన అభిప్రాయం. అందుకు, ఆనాటి పండితుల నుంచి, గ్రాంధిక భాషావాదుల నుంచి, ఆంధ్ర సారస్వత పరిషత్తు నుంచి పలు విమర్శలు, ఆటంకాలు ఎదురైనా గిడుగువారు వెరవలేదు..వెనుకంజ వేయలేదు. 'తెలుగు' మాసపత్రికను స్థాపించి తన శాస్త్రీయమైన వ్యాసాలతో, ఉపన్యాస పాఠాలతో వ్యావహారిక భాషోద్యమానికి అవిశ్రాంత పోరాటం సాగించారు. ఆ కృషి ఫలితంగా 1912-13లో స్కూల్ ఫైనల్ చదివే రోజుల్లోనే వ్యాసరచనను ఆధునిక భాషలో రాయవచ్చునని బోర్డు తెలియజేసింది. 1936లో నవ్య సాహిత్య పరిషత్తు ఏర్పడి శిష్ట వ్యావహారికాన్ని ప్రోత్సహించే 'ప్రతిభ' అనే సాహిత్య పత్రికను వెలువరించింది. 1937లో ప్రఖ్యాత చారిత్రిక పరిశోధకుడు తాపీ ధర్మారావు ఆధునిక ప్రమాణ భాషలో 'జనవాణి' అనే పత్రికను ప్రచురించారు. దాంతో రచయితలు, కవులు ఆధునిక భాషలో రచనలు చేయడం ప్రారంభించి తమ రచనలను ఆ పత్రికకు పంపేవారు. అలా గిడుగువారు అకుంఠిత దీక్షాదక్షతలతో, అనన్య సామాన్యమైన కృషితో సాగించిన వ్యావహారిక భాషోద్యమం అనంతర కాలంలో ఎంతో అభ్యుదయమైన రీతిలో ముందుకు సాగి, ప్రజలందరి ప్రశంసలు అందుకుంటూ సమాజంలో ప్రముఖమైన స్థానం సంపాదించుకుంది. నాటి గిడుగువారి సాహసోపేతమైన నిర్ణయం, సాగించిన పోరాటంతోనే నేడు వ్యావహారిక భాష ఎల్లెడలా ఫరిడవిల్లుతోంది. గిడుగువారు ప్రారంభించిన ఆ కృషితోనే నేడు వ్యావహారిక భాష అందరిభాషగా మారింది. గ్రాంధికభాష క్రమేణా పండితులకు మాత్రమే అర్థమయ్యేభాషగా పరిమితమైంది. గిడుగువారి కృషికి ఫలితంగా నేటి సమాజంలో వాడుకభాషకు ఎనలేని ప్రాధాన్యత వచ్చింది. తేలికపాటి వచనంతో, సరళ సుందరమైన రీతిలో పాఠ్యగ్రంథాలు, అనేకానేక పత్రికలు వస్తున్నాయి. సిద్ధాంత గ్రంథాలు కూడా వ్యావహారిక భాషలోనే వస్తున్నాయి. ఆకాశవాణి, దూరదర్శన్, సినిమాలు అన్నీ అందరికీ అర్థమయ్యే వ్యావహారిక భాషనే అనుసరిస్తున్నాయి. విద్య, సాహిత్యం అన్నీ వ్యావహారిక భాషలోనే ఉంటూ ప్రజలకు అత్యంత చేరువైనాయి. ఇదంతా గిడుగువారి కృషి. ఇవన్నీ ఆయన సాధించిన ఘనవిజయాలే. ఆయన మరణానికి ముందు కూడా ఆయన పత్రికలవారికి ఒక విజ్ఞప్తి చేశారు. పత్రికల వారు వాడుక భాషా (వ్యావహారిక భాష) ఉద్యమాన్ని మరింతగా ఆదరించి ముందుకు తీసుకుపోవాలని ఆ విజ్ఞప్తిలో కోరారు. ఆయన కోరుకున్నట్లుగానే పత్రికలు అందుకు ఎంతగానో సహకరించాయి. అనేక పత్రికలు నాటినుంచి వాడుకభాషనే వాడుతూ ప్రజలకు మరింత చేరువయ్యాయి. పులిదిండి మహేశ్వర్ అనే కవి గిడుగువారి గురించి ఓచోట చేసిన ప్రస్తావన ఇప్పుడు సందర్భోచితం.

*'గ్రాంధికమ్ము నెత్తిన పిడుగు గిడుగు*
*వ్యవహార భాషోద్యమ స్థాపక ఘనుడు గిడుగు*
*తేట తేనియల తెల్లని పాలమీగడ గిడుగు*
*కూరి తెలుగుభాషకు గొడుగు..గిడుగు'...*

అని ఆయన వర్ణించారు. ఇందులో ఎంతమాత్రమూ అతిశయోక్తి లేదు కూడా.

ఒక్క వ్యావహార భాషోద్యమానికే కాక, సమాజంలో అట్టడుగులో ఉన్న సవరజాతి ప్రజల సముద్ధరణకు గిడుగువారు చేసిన సేవలు అమోఘం. సవరలను తన ఇంట్లో ఉంచుకుని, వారికి భోజనాలు పెట్టి చదివించిన సంఘసంస్కర్త గిడుగు రామమూర్తి పంతులుగారు. అంతేకాదు, అప్పట్లోనే వితంతు వివాహం జరిపిన సాహసికుడు..అభ్యుదయవాది గిడుగు. తాను 56 ఏళ్ళ పాటు నివసించిన పర్లాకిమిడి గ్రామాన్ని అప్పట్లో పర్లాకిమిడి రాజా ఒరిస్సా రాష్ట్రంలో కలపడం ఇష్టంలేక ఆ ఊరును విడిచిపెట్టారాయన. తెలుగుజాతి ముద్దుబిడ్డగా, తెలుగుభాషాభిమానిగా, సంఘ సంస్కర్తగా, వ్యావహారిక భాషోద్యమ స్థాపకునిగా..సారథిగా గిడుగువారి సేవలు నాటికీ, నేటికీ, ఏనాటికీ చిరస్మరణీయమైనవే. 1940లో గిడుగువారు పరమపదించారు. అయినా, తెలుగుభాష..తెలుగుజాతి ఉన్నంతవరకు ఆయనకు మరణం లేదు..తెలుగు ప్రజల గుండెల్లో ఏనాటికీ మరచిపోలేని శాశ్వతమైన స్థానాన్ని ఆయన సాధించుకున్నారు. తెలుగు ప్రజలంతా 29.8.2017న మాతృభాషా దినోత్సవంగా, గిడుగువారి జయంతిని జరుపుకుంటున్న సందర్భంగా..ఆ మహనీయునికిదే...అక్షర నివాళి.

రచన: డా. గంగిశెట్టి శివకుమార్
సెల్ : 9441895343

## అన్నదాతల ఆశల వేదికపై...

# శతవసంతాల వేడుక

**నెల్లూరుజిల్లాలో లక్షలాదిమంది రైతులున్నారు. తడ నుండి సీతారాంపురం దాకా అన్ని గ్రామాలు, పల్లెటూర్లలో సేద్యంతో స్వేదం చిందిస్తూ పంటలు పండించే అన్నదాతలకు పొలం, హలం, నీళ్ళు, బీళ్ళు, చెరువు, ఎరువుతో తప్ప జిల్లా కేంద్రమైన నెల్లూరుతో పెద్దగా సంబంధాలుండవు. అయినా జిల్లాలో వున్న రైతులందరికీ నెల్లూరు నగరంతో వున్న అనుబంధానికి ఒకే ఒక వేదిక నెల్లూరు నడిబొడ్డున వున్న జిల్లా కేంద్ర సహకార బ్యాంకు. అవును, రైతుల కోసం, రైతుల శ్రేయస్సు కోసం నెలకొల్పిన బ్యాంకు ఇది. రైతులే ఖాతాదారులు, రైతులే సభ్యులు, రైతులే డిపాజిటర్లు, రైతులే ఋణగ్రహీతలు, ఈ బ్యాంకుకు రైతులే వెన్నెముక.**



మన కుటుంబంలో ఎవరికైనా 60 ఏళ్లు నిండితే షష్టిపూర్తి చేస్తాం. 50ఏళ్ళు వస్తే అర్ధశత జన్మదినోత్సవాన్ని ఘనంగా జరుపుతాం. అలాంటిది లక్షలాది మంది రైతులతో బంధం, అనుబంధం వున్న జిల్లా కేంద్ర సహకార బ్యాంకుకు వందేళ్ళు వస్తే... ఆ వేడుకను ఇంకెంత ఘనంగా జరపాలి. అలాంటి వేడుకకే నెల్లూరు జిల్లా కేంద్ర సహకార బ్యాంకు ముస్తాబవుతోంది. ఈ నెల 8వతేదీ మధ్యాహ్నం 3గంటలకు బ్యాంకు ప్రాంగణంలోనే నిర్వహించన్ను శత వసంతాల వేడుకలను రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు చేతుల మీదుగా ప్రారంభించేందుకు సన్నాహాలు జరుగుతున్నాయి. బ్యాంకు ఛైర్మెన్ మెట్టుకూరు ధనుంజయరెడ్డి నేతృత్వంలో బ్యాంకు పాలక మండలి కమిటి సభ్యులు ఆహ్వాన కమిటీగా ఏర్పడి శత వసంతోత్సవ సంబరాలను చరిత్రలో చిరస్మరణీయంగా నిలిచేలా ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ వేడుకలకు రాష్ట్ర సహకార శాఖ మంత్రి సి.ఆదినారాయణరెడ్డి, రాష్ట్ర పరిశ్రమలశాఖ మంత్రి ఎన్.అమర్‌నాథ్‌రెడ్డి, రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, రాష్ట్ర మున్సిపల్ శాఖ మంత్రి పి.నారాయణ, రాష్ట్ర పంచాయితీరాజ్‌శాఖ మంత్రి నారా లోకేష్, రాష్ట్ర పౌరసరఫరాల శాఖామంత్రి పత్తిపాటి పుల్లారావులు ముఖ్యఅతిథులుగా, ఏపి రాష్ట్ర సహకార బ్యాంకు ఛైర్మెన్ పిన్నమనేని కోటేశ్వరరావు, తెలంగాణ రాష్ట్ర సహకార బ్యాంకు ఛైర్మెన్ కె.రవీందర్‌రావు విశిష్ట అతిథులుగా పాల్గొననున్నారు. అలాగే జిల్లాకు చెందిన ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఆయా సంస్థల ఛైర్మెన్‌లు, మాజీమంత్రులు, మాజీశాసనసభ్యులు, మాజీ శాసనమండలి సభ్యులు, మాజీ కేంద్ర సహకార బ్యాంకు ఛైర్మెన్‌లు, సహకార శాఖ రాష్ట్ర ఉన్నతాధికారులు, జిల్లా ఉన్నతాధికారులు ఈ వేడుకలకు హాజరవుతున్నారు. వందేళ్లకాలంలో ఈ బ్యాంకు అభివృద్ధి కోసం కృషి చేసిన బ్యాంకు మాజీ ఛైర్మెన్‌లను, మాజీ జనరల్ మేనేజర్‌లను ఈ వేదికపై సన్మానించాలని పాలకవర్గం నిర్ణయించింది.

నెల్లూరుజిల్లా కేంద్ర సహకార బ్యాంకు శతవసంతాల ప్రయాణంలో ఎన్నో మలుపులున్నాయి. ప్రగతి పథంలో ఎంతో మంది కృషి వుంది. ఉమ్మడి మద్రాసు రాష్ట్రంలో 1918 సంవత్సరం జనవరి 11వ తేదీన మద్రాసు రాష్ట్ర సహకార చట్టం క్రింద నేటి జిల్లా కేంద్ర సహకార బ్యాంకు రిజిష్టర్ చేయబడింది. గ్రామీణ రైతులే సభ్యులుగా ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాలు ఏర్పడ్డాయి. ఇవన్నీ కూడా జిల్లా కేంద్ర సహకార బ్యాంకు పరిధిలో రైతులకు వాణిజ్య బ్యాంకుల కంటే మిన్నగా సేవలందించసాగాయి. 1933 అక్టోబర్ 17వ తేదీన ఇప్పుడున్న కేంద్ర సహకార బ్యాంకు భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. రావు బహుద్దూర్ చెంగయ్య పంతులు, రేబాల దశరథరామిరెడ్డి, చుండూరు సుబ్బయ్యశెట్టి, ఏ.సి.సుబ్బారెడ్డిలు ఒక కమిటీగా ఏర్పడి ఈ భవన నిర్మాణ సన్నాహాలు సాగించారు. 1935 ఏప్రిల్ 21వ తేదీన మద్రాసు ప్రొవిన్షియల్ కో-ఆపరేటివ్ బ్యాంకు లిమిటెడ్ ప్రెసిడెంట్ వి.రామదాసు పంతులు చేతుల మీదుగా ఈ బ్యాంకు భవనాన్ని ప్రారంభించడం జరిగింది. ఆరోజుకు బ్యాంకు అధ్యక్షుడుగా రేబాల దశరథరామిరెడ్డి వున్నారు. ఈ బ్యాంకు నిర్మాణం కోసం ప్రభుత్వం రెండు వేల రూపాయలను షేర్ క్యాపిటల్‌గా మంజూరు చేసింది. అప్పటి నుండి ఇప్పటి దాకా బ్యాంకు అంచలంచెలుగా ఎదుగుతూ శాఖోపశాఖలుగా విస్తరించింది. రావుబహుద్దూర్ చెంగయ్య పంతులు బ్యాంకు మొదటి అధ్యక్షులుగా సేవలందించారు. కె.వి.రాఘవాచార్యులు, రావు సాహెబ్ విశ్వనాథరావు పంతులు, రేబాల దశరథరామిరెడ్డి, రేబాల లక్ష్మీనరసారెడ్డి, దువ్వూరు బలరామిరెడ్డి, ఆనం వెంకటరెడ్డి, ఆనం భక్తవత్సలరెడ్డి, సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, ఆనం వివేకానందరెడ్డి, వేమారెడ్డి రామచంద్రారెడ్డి, వేనాటి మునిరెడ్డి, మేకల హజరత్తయ్య, వాకాటి నారాయణరెడ్డి, వేమారెడ్డి శ్యాంసుందర్‌రెడ్డిలు ఈ వందేళ్లలో బ్యాంకు ఛైర్మెన్‌లుగా సేవలందించి బ్యాంకు పురోభివృద్ధిలో భాగస్వాములయ్యారు.

## ఇది నా అదృష్టం - మెట్టుకూరు ధనుంజయరెడ్డి



నేను మెట్ట ప్రాంతంలో పుట్టాను. రైతు సమస్యలు తెలిసిన వాడిని. నిద్రలేస్తే రైతు కష్టం చూసే వాడిని. జిల్లా కేంద్ర సహకార బ్యాంకు ఛైర్మెన్‌గా రైతులకు ఈ రూపంలో సేవచేసే అవకాశం రావడం నిజంగా నా అదృష్టం. ఇందులో వున్న సంతృప్తి ఇక ఏ పదవిలోనూ, ఏ బాధ్యతలోనూ వుండదు. రైతు వుంటే ఈ ప్రపంచం వుంటుంది, రైతు తింటేనే మనం తింటాం. కాబట్టి మనం రైతులను గౌరవించాలి. రైతులను ప్రోత్సహించాలి. నేను బ్యాంకు ఛైర్మెన్‌గా బాధ్యతలు చేపట్టాక రైతుల శ్రేయస్సు కోసం, వారి సమస్యలు తీర్చడం కోసం అహర్నిశలు కృషి చేసా! రాష్ట్ర ప్రభుత్వం మా పాలకవర్గ సభ్యులు పూర్తి స్థాయిలో సహకరించారు కాబట్టే బ్యాంకును అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లగలుగుతున్నాం. బ్యాంకు శత వసంతాల వేడుక జరుపుకునే సమయంలో బ్యాంకు ఛైర్మెన్‌గా నేనుండడం నా పూర్వజన్మ సుకృతం. ఈ వందేళ్ల ప్రయాణం ఒక చరిత్ర. ఆ చరిత్రలో నా పేరు నిలబడడం నాకు లభించిన వరం.





ప్రథమ వర్ధంతి

ప్రముఖ న్యాయవాది, మా ఇంటి దైవం

గునుపాటి ఆదిశేషారెడ్డి గారు

పరమపదించి తేది. 03.09.2017కి ఏడాది గడవనున్న సందర్భంగా

ఆ పుణ్యమూర్తిని స్మరిస్తూ...

వారి ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుని ప్రార్థిస్తూ...

కుమారులు - కోడళ్ళు

గునుపాటి శ్రీనివాసులురెడ్డి - సింధు

గునుపాటి మురళీకృష్ణారెడ్డి - ప్రతిమ

కుమార్తెలు - అల్లుళ్ళు

ఉప్పల విజయలక్ష్మి - సుదర్శన్‌రెడ్డి

లేట్ పెనుబోలు పద్మజ - చంద్రశేఖర్‌రెడ్డి

పోలకూరు మాధవి - పద్మాకర్‌రెడ్డి

మనుమలు, మనుమరాళ్ళు

ముదిమనుమలు - ముదిమనుమరాళ్ళు

మరియు

ఇతర కుటుంబసభ్యులు


Edited, Published, Printed & Owned by **THUNGA SIVAPRABHATH REDDY**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at **Roopa Graphics**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Ph:2323485. Editor-**THUNGA SIVAPRABHATH REDDY,** Executive Editor-**G.SREENIVASULU REDDY**. e-mail: roopagroup@yahoo.com